S TV SAMAYAM

epaper.samayamdaily.net

APTEL/26/A3949

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

సంపుటి: 1 | సంచిక: 59 | ఎడిటర్ : అలీ ముర్తుజా | ఆదివారం 30 ఆగస్ట్ 2026 | ప్రచురణ : విజయవాడ | పేజీలు: 8 | వెల: రూ.5 |

సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

## విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565



## అది అంటరానితనానికి మరో రూపం

ఖర్గే దళితుడైనందుకే మైదానం శుద్ధి చేశారా?

బీజేపీ, ఆర్ఎస్ఎస్‌పై రాహుల్ గాంధీ ఆగ్రహం


4

## రెండు దేశాల పర్యటనకు ప్రధాని మోదీ!

- ఉజ్బెకిస్థాన్, కిర్గిజ్ రిపబ్లిక్ దేశాల్లో పర్యటన
- వాణిజ్యం, రక్షణ, డిజిటల్ రంగాలపై కీలక చర్చలు
- 26వ షాంఘై సహకార సంస్థ సదస్సుకు హాజరు

4





## రేపే వెలిగొండ ప్రారంభం

నిర్వాసితుల తరలింపునకు రూ.4.07 కోట్లు విడుదల

పది వేల కుటుంబాలకు నిత్యావసర సరుకుల కిట్లు

ఇప్పటికే రూ.768 కోట్ల పరిహారం

2





## సంజీవని.. డిజిటల్

# వైద్య విప్లవం

### మారుమూల ప్రాంతాల్లో ఇంటి వద్దకే వైద్యం

- రూ.250 కోట్లతో హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్
- గిరిజన ప్రాంతాల్లో ఉపాధి కల్పన
- సీఎం చంద్రబాబు.. ఆర్కే నగర్‌లో గిరిజనులతో ముఖాముఖి

**అరకు (సమయం న్యూస్):** రాష్ట్రంలో డిజిటల్ ఆరోగ్య రికార్డులతో ఇంటి వద్దకే మెరుగైన వైద్యం అందించే 'సంజీవని' ప్రాజెక్టును త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. వైద్యం కోసం ప్రజలు కిలోమీటర్ల దూరం ప్రయాణించే పరిస్థితి ఉండకూడదన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. అల్లూరి జిల్లా అరకు మండలం గన్నెల పంచాయతీ పరిధిలోని ఆర్కే నగర్‌లో శనివారం ముఖ్యమంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా ఆరోగ్య రథాలను జెండా ఊపి ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన ప్రజా వేదిక వద్ద ఆయన ప్రసంగించారు. గిరిజన ప్రాంతాల్లో ప్రతి కుటుంబానికీ నాణ్యమైన వైద్యం

మిగతా 2 లో

## మాది నాటే సంస్కృతి.. నరికేది కాదు!



### పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

- గత పాలకుల తీరుపై నాగబాబు ధ్వజం
- అరణ్యారామంలో మొక్కలు నాటిన దంపతులు
- సీఎం, డిప్యూటీ సీఎం ఆలోచనలు ఒక్కటే
- అటవీశాఖ నూతన భవన డిజైన్ల పరిశీలన

2



## గ్రామీణ క్రీడాకారులకు పట్టాభిషేకం!

అమరావతి ఛాంపియన్‌షిప్ ముగింపు వేడుకల్లో స్పీకర్ అయ్యన్నపాత్రుడు

2



02

- ఉన్నతి సంఘానికి చెక్కుల అందజేత
- పంపిణీ చేసిన మంత్రి రామ్మోహన్ నాయుడు

## చెంచుల ఉన్నతికి కట్టుబడి ఉన్నాం

సున్నా వడ్డీతో ఎనిమిది లక్షల రుణం



## కొలంబియా వర్సిటీతో వీఐటీ ఒప్పందం!

2



## నేను నమ్మకద్రోహిని ఎలా అవుతా?

- నాటి కాంగ్రెస్ తో సజ్జలలా నేను సంధి చేసుకోలేదు
- నమ్మకంగా ఉన్నందుకే పదిహేను నెలల జైలు జీవితం
- నాపై కుట్ర చేసి బాధ్యతలు లాక్కున్నారు: విజయసాయి

3

# విదేశీ సాయానికి నేపాల్ గ్రీన్ సిగ్నల్



- జలవిలయంపై మనసు మార్చుకున్న ప్రభుత్వం
- రక్షణ చర్యలకు పరిమిత సంఖ్యలో అనుమతి
- భారత్ నుంచి చేరుకున్న 10 టన్నుల అత్యవసర సామగ్రి
- చైనా బోర్డర్ పోలీసు వీరోచిత సాహసం

వివరాలు 3లో..



3

## విశాఖలో విషాదం!

- ఒకే కుటుంబానికి చెందిన నలుగురి ఆత్మహత్య
- పెందుర్తి మండలం చింతలగ్రహారంలో ఘటన

### సింహాద్రి అప్పన్న దేవస్థానంలో ముగ్గురు

## ఉద్యోగుల సస్పెన్షన్

నిర్లక్ష్యంగా వ్యవహరించిన మరొకరికి షోకాజ్ నోటీసు

# నేడు అనంతపురానికి సీఎం

**గుంతకల్లు ఎమ్మెల్యే కుమార్తె వివాహానికి హాజరుకానున్న చంద్రబాబు**

**భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ**


**అనంతపురం (సమయం న్యూస్):** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదివారం అనంతపురంలో జరగనున్న వివాహ వేడుకకు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ పి.జగదీష్ క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించారు. శిల్పారామం వద్ద హెలిప్యాడ్, బళ్లారి రోడ్డులోని ఎంవీఆర్ కల్యాణ మండపం వద్ద పార్కింగ్ స్థలాలను సందర్శించారు. సీఎం కాన్వాయ్ రూట్ మ్యాప్, భద్రతా వసతులను పరిశీలిస్తూ ముందస్తు భద్రతా తనిఖీలు నిర్వహించారు. వీఐపీల రాకపోకలకు ఇబ్బంది లేకుండా బారికేడ్ల ఏర్పాటుకు సూచనలు చేశారు. స్థానిక తెదేపా నాయకులు పూల నాగరాజు, కేశవరెడ్డి అధికారులతో పాటు ఉన్నారు. ఆదివారం ఉదయం పది గంటలకు గుంటూరు జిల్లా ఉండవల్లిలోని తన నివాసం నుంచి ముఖ్యమంత్రి హెలికాప్టర్‌లో బయలుదేరుతారు. ఉదయం పదకొండున్నర గంటలకు తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం ఎంజీఎం ఆసుపత్రికి చేరుకుంటారు. ఉదయం పదకొండు నలభై నుంచి పదకొండు యాభై ఐదు వరకు తొట్టంబేడు మండలం సీఆర్ఎన్ కండ్రికలో దివంగత పీఆర్ మోహన్ కుమార్తె వివాహ వేడుకకు హాజరవుతారు. మధ్యాహ్నం ఒకటి పదిహేను నిమిషాలకు తిరుపతి నుంచి బయలుదేరి అనంతపురంలోని శిల్పారామం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం ఒకటిన్నర నుంచి ఒంటి గంట నలభై ఐదు నిమిషాల వరకు బళ్లారి రోడ్డులోని ఎంవీఆర్ కల్యాణ మండపంలో జరిగే గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుమార్తె వివాహ వేడుకలో పాల్గొంటారు. మధ్యాహ్నం రెండు గంటలకు తిరిగి శిల్పారామం హెలిప్యాడ్ నుంచి హెలికాప్టర్లో ఉండవల్లికి పయనమవుతారు.

# రేపే వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం!

**నిర్వాసితుల తరలింపునకు రూ.4.07 కోట్లు విడుదల**

**పది వేల కుటుంబాలకు నిత్యావసర సరుకుల కిట్లు**

**ఇప్పటికే రూ.768 కోట్ల పరిహారం చెల్లించిన సర్కారు**



**అమరావతి (సమయం న్యూస్):** రేపు జరగనున్న వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రాజెక్టు పరిధిలోని నిర్వాసిత కుటుంబాలను పునరావాస కాలనీలకు స్వచ్ఛందంగా తరలించేందుకు తక్షణ ఆర్థిక సాయం ప్రకటించింది. ఇందుకు అవసరమైన రూ.4.07 కోట్ల నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో అధికారులు ఏర్పాట్లు వేగవంతం చేశారు. నిర్వాసిత కుటుంబాలకు చెందిన పశువుల కోసం ప్రభుత్వం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంది. ప్రాజెక్టు పరిధిలోని 10 గ్రామాల ప్రజల వద్ద ఉన్న 4,933 మూగజీవాలకు 30 రోజుల పాటు దాణా అందించనుంది. ఇందుకు 295.98 మెట్రిక్ టన్నుల దాణా అవసరమని అధికారులు అంచనా వేశారు. దీని కోసం రూ.65.8 లక్షలను ప్రభుత్వం కేటాయించింది. పునరావాస కాలనీలకు వెళ్లే 10,000 మందికి నిత్యావసర సరుకుల కిట్లను ప్రభుత్వం పంపిణీ చేయనుంది. ఒక్కో కిట్ విలువను రూ.2,818గా నిర్ణయించారు. ఇందులో 25 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, కిలో చక్కెర, లీటరు వంటనూనె, రెండు కిలోల ఉల్లిపాయలు, రెండు కిలోల బంగాళదుంపలు ఉంటాయి. వీటి కోసం ప్రభుత్వం రూ.2.81 కోట్లను మంజూరు చేసింది. కొత్త ఇళ్లలోకి ప్రవేశిస్తున్న 6,000 మంది మహిళలకు ప్రభుత్వం ప్రత్యేకంగా కిట్లను బహుమతిగా ఇవ్వనుంది. వెయ్యి రూపాయల విలువైన ఈ కిట్‌లో చీర, గాజులు, పసుపు, కుంకుమ ఉంటాయి. ఇందుకోసం రూ.60 లక్షలు ఖర్చు చేయనున్నారు. నిర్వాసితులు సురక్షితంగా తమ కొత్త ఇళ్లకు చేరుకునేలా ఈ ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రాజెక్టు బాధితులకు ఇప్పటికే రూ.768 కోట్ల పరిహారాన్ని చెల్లించినట్లు అధికారులు స్పష్టం చేశారు.

# కొలంబియా వర్సిటీతో వీఐటీ ఒప్పందం!

**న్యూయార్క్ వేదికగా చారిత్రాత్మక ఘట్టం**

**తొలి భారతీయ విశ్వవిద్యాలయంగా రికార్డు**

**ఇంజినీరింగ్ విద్యార్థులకు ద్వంద్వ డిగ్రీ అవకాశం**

**ఒప్పంద పత్రాలపై వీఐటీ ఛాన్సలర్ విశ్వనాథన్ సంతకం**

**ప్రపంచస్థాయి విద్యను అందించడమే లక్ష్యం**

**వేలూరు (సమయం న్యూస్):** కొలంబియా విశ్వవిద్యాలయంతో వీఐటీ కీలక అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. న్యూయార్క్ నగరంలోని భారత కాన్సుల్ జనరల్ బినయ శ్రీకాంత ప్రధాన్ సమక్షంలో ఈ లాంఛనప్రాయ కార్యక్రమం జరిగింది. వీఐటీ ఛాన్సలర్ డాక్టర్ జి.విశ్వనాథన్, కొలంబియా వర్సిటీ అకాడమిక్ అఫైర్స్ డీన్ సెనేటర్ సొలేమనే కచాని ఈ ఒప్పంద పత్రాలపై అధికారికంగా సంతకాలు చేశారు. ఈ చారిత్రాత్మక భాగస్వామ్యంతో ఉన్నత విద్యా రంగంలో సరికొత్త అధ్యాయం మొదలైంది. కొలంబియా వర్సిటీతో ద్వంద్వ డిగ్రీ ఒప్పందాన్ని కుదుర్చుకున్న తొలి భారతీయ విద్యాసంస్థగా వీఐటీ చరిత్ర సృష్టించింది. ఈ అనుసంధానంతో ఇంజినీరింగ్ విద్యార్థులకు ప్రపంచస్థాయిలో అత్యున్నత విద్యావకాశాలు అందుబాటులోకి రానున్నాయి. నాణ్యమైన ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఇది సుగమమైన మార్గంగా మారనుంది. ఈ ఒప్పందం తమ సంస్థ చరిత్రలో ఒక మైలురాయి లాంటిదని వీఐటీ వ్యవస్థాపకులు డాక్టర్ జి.విశ్వనాథన్ హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచంలోని అత్యంత ప్రతిష్ఠాత్మక సంస్థల్లో ఒకటైన కొలంబియా వర్సిటీతో కలిసి ద్వంద్వ డిగ్రీ కార్యక్రమాన్ని ప్రారంభించడం తమకు ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. విద్యార్థులకు ప్రపంచస్థాయి పోటీకి తగిన శిక్షణను అందించడంలో తమ చిత్తశుద్ధికి ఈ భాగస్వామ్యం నిలువెత్తు నిదర్శనమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వీఐటీ ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.వి.సెల్వం, అంతర్జాతీయ వ్యవహారాల సంచాలకులు డాక్టర్ ఆర్.శీనివాసన్ పాల్గొన్నారు.

# సంజీవని.. డిజిటల్ వైద్య విప్లవం

(మొదటి పేజీ తరువాయి..)

అందించేందుకే సంజీవని ప్రాజెక్టు తీసుకువచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రూ. 250 కోట్లతో ట్రైబల్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంప్లీషన్ మిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. సంజీవని ప్రాజెక్టు ద్వారా అల్లూరి జిల్లాలోని గన్నెల పీహెచ్‌సీలో డ్రోన్ సేవల పనితీరును సీఎం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఏజెన్సీ ప్రాంతాల నుంచి రక్త నమూనాలను డ్రోన్ల ద్వారా పెద్ద ఆసుపత్రులకు పంపి, వేగంగా పరీక్షలు చేయించి మందులు అందించే విధానాన్ని ఆయన అభినందించారు. గర్భిణులకు 'తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్', 104 వాహనాల ద్వారా సంచార వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. కుప్పం, చిత్తూరు జిల్లాల్లో విజయవంతమైన సంజీవని ప్రాజెక్టు అల్లూరి జిల్లాలో అత్యవసర వైద్య సేవల కోసం 150 వాహనాలతో 'ఎమర్జెన్సీ లైఫ్‌లైన్ నెట్‌వర్క్'గా రూపుదిద్దుకుందని వివరించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఐదు సూత్రాల ప్రణాళికను సీఎం ప్రకటించారు. 'అడవి తల్లి బాట' పేరుతో రూ.1000 కోట్లతో 905 కిలోమీటర్ల రహదారులు, 1.60 లక్షల ఇళ్లకు తాగునీరు, సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటు లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. అరకు కాఫీని మరో లక్ష ఎకరాల్లో విస్తరించి, యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ద్వారా ఉపాధి కల్పిస్తామన్నారు. రాబోయే మూడేళ్లలో లక్ష మంది గిరిజన యువతకు ఈ శిక్షణ అందజేస్తామని హామీ ఇచ్చారు. పర్యాటక రంగం ద్వారా గిరిజన కుటుంబాల ఆదాయం పెంచేందుకు హోమ్‌స్టే విధానాన్ని ప్రోత్సహిస్తామన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగాలన్నీ స్థానికులకే దక్కేలా గతంలో తమ ప్రభుత్వమే జీవో 3ని తెచ్చిందని సీఎం గుర్తుచేశారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్లే సుప్రీంకోర్టు దాన్ని రద్దు చేసిందని ఆరోపించారు. దీనికి ప్రత్యామ్నాయంగా అందరికీ ఆమోదయోగ్యమైన విధానాన్ని త్వరలోనే తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఐఐటీ, నీట్ వంటి



జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు గిరిజన విద్యార్థులను సన్నద్ధం చేయడానికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని, ఐఐటీ మద్రాస్‌తో ఒప్పందం చేసుకున్నామని తెలిపారు.

### గత పాలనలో విధ్వంసం, మత మార్పిడులు

గత ప్రభుత్వ హయాంలో గంజాయి, కల్తీ మద్యంతో ఏజెన్సీ ప్రాంతాల ప్రతిష్టను దిగజార్చారని ముఖ్యమంత్రి విమర్శించారు. జే బ్రాండ్లతో వేలాది మంది ప్రాణాలు తీశారని, వ్యవస్థలను అస్తవ్యస్తం చేశారని ఆరోపించారు. పవిత్రమైన దేవాలయాలపై దాడులు జరిగాయని, పార్టీలో ఉండాలంటే మతం మారాలనేంతగా బలవంతపు మత మార్పిడులు జరిగాయని మండిపడ్డారు. గ్రూప్-1 లాంటి ప్రతిష్ఠాత్మక పరీక్షా పత్రాలను ఎలక్ట్రీషియన్లు, అటెండర్లతో దిద్దించి నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఏకగ్రీవాలపై ఒక మాట, ఇప్పుడు మరో మాట చెబుతూ విపక్ష నేతలు స్థానిక సంస్థల ఎన్నికలపైనా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని దుయ్యబట్టారు. సాగు, తాగు నీటి ప్రాజెక్టుల పునరుద్ధరణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని సీఎం తెలిపారు. సెప్టెంబర్ 2న పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి గోదావరి నీటిని తీసుకువస్తున్నట్లు ప్రకటించారు. అలాగే, ఆగస్టు 31న వెలిగొండ ప్రాజెక్టుకు కృష్ణా జలాలను విడుదల చేస్తున్నట్లు చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం, వైద్యం, ఉపాధి రంగాల్లో ప్రభుత్వం సమగ్ర ప్రణాళికలతో ముందుకెళ్తోందని వివరించారు.

### గిరిజనులతో మమేకమైన ముఖ్యమంత్రి

సంజీవని ప్రాజెక్టు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డు ఉన్న ఓ గర్భిణీతో సీఎం ప్రత్యేకంగా ముచ్చటించారు. ఆమెకు అందుతున్న వైద్య సేవలు, పరీక్షలు, మందులు సరైన సమయంలో అందుతున్న తీరును ఆరాతీశారు. నలుగురు పిల్లలున్న మరో కుటుంబంతో మాట్లాడుతూ 'తల్లికి వందనం' ద్వారా అందరికీ ప్రయోజనం అందుతోందా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే, అన్నదాత సుఖీభవ, స్త్రీశక్తి పథకాల గురించి సుమారు 30 మంది లబ్ధిదారులతో నేరుగా ముఖాముఖి నిర్వహించారు.

అల్లూరి సీతారామరాజు సేవలను స్మరించుకుంటూ భోగాపురం కొత్త ఎయిర్‌పోర్టుకు ఆయన పేరు పెట్టామని సీఎం గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సత్యకుమార్ యాదవ్, గుమ్మిడి సంధ్యారాణి, జీసీసీ ఛైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# చెంచుల ఉన్నతికి కట్టుబడి ఉన్నాం!

- సున్నా వడ్డీతో ఎనిమిది లక్షల రుణం
- ఉన్నతి సంఘానికి చెక్కుల అందజేత
- పంపిణీ చేసిన మంత్రి రామ్మోహన్ నాయుడు
- సాంప్రదాయ వృత్తికి ఆర్థిక తోడ్పాటు
- సకాలంలో సాయం అందడంపై సర్వత్రా హర్షం

**శ్రీకాకుళం (సమయం న్యూస్):** గిరిజనుల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. స్థానిక కలెక్టరేట్ లో శనివారం చెంచు తెగకు చెందిన ఉన్నతి సంఘం సభ్యులకు సున్నా వడ్డీతో ఎనిమిది లక్షల రూపాయల బ్యాంక్ లింకేజ్ రుణం చెక్కును ఆయన అందజేశారు. చెంచు వృత్తి చేసుకునేవారు తమ సాంప్రదాయ వస్త్రాలను కొనుగోలు చేసేందుకు, ఇతర అవసరాల కోసం ఈ నిధులను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. గత సంక్రాంతి పండుగ భోగి రోజున మంత్రి రామ్మోహన్ నాయుడును ఆయన స్వగృహంలో చెంచు తెగ ప్రతినిధులు కలిశారు. పాత



సంప్రదాయాలను పాటిస్తూ కుల వృత్తిని కొనసాగించాలని ఆ సందర్భంగా మంత్రి వారిని కోరారు. అయితే తమ వృత్తికి అవసరమైన వస్త్రాల కొనుగోలుకు ఆర్థిక సాయం కావాలని వారు విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి ఐటీడీఏ అధికారులకు సిఫార్సు చేసి సున్నా వడ్డీతో రుణం మంజూరయ్యేలా కృషి చేశారు. మంత్రి ఆదేశాలతో మంజూరైన రుణాలకు సంబంధించిన చెక్కులను లబ్ధిదారులకు శనివారం అందించారు. వడ్డీ భారం లేకుండా ఈ భారీ మొత్తం అందుతుండటంతో ఉన్నతి సంఘం సభ్యులు తీవ్ర ఆనందం వ్యక్తం చేశారు. తమ సమస్యను వెంటనే పరిష్కరించిన రామ్మోహన్ నాయుడుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం శాసనసభ్యుడు గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఐటీడీఏ పీవో స్వప్నిల్, శిక్షణ కలెక్టర్ హరి ఓం పాండ్య పాల్గొన్నారు.

# మాది నాటే సంస్కృతి.. నరికేది కాదు!

**పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత**

**గత పాలకుల తీరుపై నాగబాబు ధ్వజం**

**అరణ్యారామంలో రావి, వేప మొక్కలు నాటిన దంపతులు**



**మంగళగిరి (సమయం న్యూస్):** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ కొణిదెల నాగబాబు స్పష్టం చేశారు. మంగళగిరిలోని అరణ్యారామం నందవనంలో శనివారం ఆయన సతీమణితో కలిసి శాస్త్రోక్తంగా రావి, వేప మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత పాలకులకు అడ్డువచ్చిన చెట్లను నరకడం తప్ప నాటాలనే ఆలోచన ఏకోశానా రాలేదని విమర్శించారు. భవిష్యత్తు తరాలకు మెరుగైన వాతావరణం అందించాలనే విషయంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తో పాటు తన ఆలోచనలు ఒకేలా ఉన్నాయన్నారు. పుట్టినప్పటి నుంచి తుది శ్వాస వరకు సమస్త వనరులను ఇస్తున్న భూమాతను విచక్షణారహితమైన మైనింగ్, అడవుల నరికివేతతో గాయపరుస్తున్నామని నాగబాబు ఆవేదన వ్యక్తం చేశారు. రావి, వేప చెట్లను ఒకే గుంతలో నాటడాన్ని అశ్వత్థ నారాయణ వివాహంగా పిలుస్తారని గుర్తుచేశారు. వందలాది జీవరాశులకు ఆవాసంగా మారే ఈ చెట్ల పెంపకంతో జీవ వైవిధ్యం సమతుల్యంగా ఉంటుందని వివరించారు. అటవీ, పర్యావరణ శాఖల పరిశోధన, శిక్షణ కోసం ఇరవై నాలుగు కోట్లతో నిర్మించనున్న అరణ్యారామం నూతన భవన డిజైన్లను నాగబాబు పరిశీలించారు. పది నెలల్లోనే భవన నిర్మాణం పూర్తవుతుందని పీసీసీఎఫ్ చీఫ్ పి.వి.చలపతిరావు ఆయనకు తెలిపారు. భవన నిర్మాణం కోసం డెబ్బై మూడు చెట్లను నరకకుండా, పునఃప్రతిష్ఠాపన విధానంలో వేరే చోట విజయవంతంగా నాటడాన్ని నాగబాబు స్వయంగా పరిశీలించి అటవీశాఖ అధికారులను ప్రత్యేకంగా అభినందించారు.



# గ్రామీణ క్రీడాకారులకు పట్టాభిషేకం!

**అమరావతి ఛాంపియన్‌షిప్ ముగింపు వేడుకల్లో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు**

**తిరుపతి (సమయం న్యూస్):** క్రీడలను విద్యతో అనుసంధానం చేస్తూ ప్రతిభావంతులకు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు స్పష్టం చేశారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన అమరావతి ఛాంపియన్‌షిప్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తల్లిదండ్రులు పిల్లల చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యం ఇవ్వాలని, గ్రామీణ స్థాయిలో ప్రభుత్వ స్థలాల్లో వాకింగ్, రన్నింగ్ ట్రాక్‌లు అభివృద్ధి చేయాలని ఆయన సూచించారు. రాష్ట్రంలోని నూట డెబ్బై ఐదు నియోజకవర్గాల్లో పోటీలు నిర్వహించి తుది పోటీలను తిరుపతిలో జరపడం గర్వకారణమని మంత్రి రామ్ ప్రసాద్ అన్నారు. విజయవాడ, అమరావతి ప్రాంతంలో ఐదొందల ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీ, నెల్లూరులో క్రీడా పరికరాల తయారీ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. గ్రామీణ స్థాయి నుంచే క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఆరు అకాడమీలు స్థాపిస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. క్రీడలు, యోగా ద్వారా ఆరోగ్యకరమైన ఆంధ్రప్రదేశ్ నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

### ప్రభుత్వ విద్యార్థుల సత్తా

అమరావతి ఛాంపియన్‌షిప్‌లో సుమారు రెండు లక్షల ఏడు వేల మంది క్రీడాకారులు పాల్గొనడం చారిత్రాత్మక విజయమని శాప్ చైర్మన్ రవి నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఫైనల్స్‌కు చేరిన తొమ్మిది వేల తొమ్మిది వందల పదకొండు మందిలో ఎనభై శాతానికి పైగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులే ఉన్నారని వివరించారు. రాష్ట్ర యువతలో ఒలింపిక్ పతకాలు సాధించే సత్తా ఉందని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అభినందించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హాకీ క్రీడాకారిణి రజని, తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విదేశీ సాయానికి నేపాల్ గ్రీన్ సిగ్నల్

- జలవిలయంపై మనసు మార్చుకున్న ప్రభుత్వం
- రక్షణ చర్యలకు పరిమిత సంఖ్యలో అనుమతి
- భారత్ నుంచి చేరుకున్న 10 టన్నుల అత్యవసర సామగ్రి
- ముగ్గురు పిల్లల అద్భుత ప్రాణదానం
- చైనా బోర్డర్ పోలీసు వీరోచిత సాహసం



**ఖాట్మండు (సమయం న్యూస్):** జలప్రళయంతో విలవిలలాడుతున్న తమకు విదేశీ సాయం వద్దంటూ తొలుత తిరస్కరించిన నేపాల్ ప్రభుత్వం ఎట్టకేలకు మనసు మార్చుకుంది. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం ఇతర దేశాల బృందాలను పరిమితంగా అనుమతించేందుకు అంగీకరించింది. గల్లంతైన వారిలో విదేశీయులు కూడా ఉండటంతో ఆయా దేశాల దౌత్యపరమైన ఒత్తిడి మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. సొరంగాల్లో రక్షణ చర్యలు, డీఎన్ఏ టెస్టింగ్, ఫోరెన్సిక్ పరీక్షలు చేయగల అంతర్జాతీయ సిబ్బందికి మాత్రమే అనుమతి ఇవ్వనుంది. పొరుగుదేశమైన నేపాల్‌కు భారత్ నుంచి ఇప్పటికే 10 టన్నుల అత్యవసర సామగ్రితో మూడో విమానం చేరుకుంది. వైద్యులు, సహాయక సిబ్బందితో కూడిన 11 మంది బృందం కూడా అక్కడకు చేరుకుని సహాయక చర్యల్లో పాలుపంచుకుంటోంది. వరదల్లో చిక్కుకున్న 84 మంది భారతీయులను నేపాల్ రక్షించగా, అందులో తమిళనాడుకు చెందిన 21 మంది సురక్షితంగా స్వదేశానికి చేరుకున్నారు. ఇంకా 320 మంది ఆచూకీ తెలియాల్సి ఉందని భారత ప్రభుత్వం వెల్లడించింది. తాజా వరదల వల్ల నేపాల్‌లో ఇప్పటివరకు 616 మంది ప్రాణాలు కోల్పోగా, 2400 మందికి పైగా గల్లంతయ్యారు.

### అద్భుతంగా బతికిన బాలలు

నేపాల్‌లోని రసువా జిల్లాలో వరదలకు గురైన పాఠశాల నుంచి 8 ఏళ్ల జయల్ పులే అద్భుతంగా ప్రాణాలతో బయటపడ్డాడు. వరద సమయంలో ఒక స్నేహితుడితో కలిసి అడవిలోకి పారిపోయిన జయల్, చెట్టు ఎక్కి ప్రాణాలు దక్కించుకున్నాడు. తీవ్ర గాయాల పాలైన అతడిని పోలీసులు గుర్తించి ఆస్పత్రిలో చేర్చారు. ఒక జర్నలిస్టు సాయంతో తల్లి మాయా తమాంగ్ తన కుమారుడిని చూసి ఆనందబాష్పాలు రాల్చింది. అనంతరం మరో కుమారుడిని కూడా అధికారులు రక్షించినట్లు సమాచారం అందడంతో ఆ తల్లి సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. నేపాల్-చైనా సరిహద్దులో వరదల సమయంలో చైనా బోర్డర్ పోలీసు హువాంగ్ పెంగ్ సాహసోపేతంగా పలువురి ప్రాణాలను రక్షించాడు. టిబెట్‌లోని గీరాంగ్ పోర్టు వద్ద పలువురిని సురక్షిత ప్రాంతాలకు తరలించిన అతడు, చివరకు అదే వరదలో కొట్టుకుపోయాడు. తమ ప్రాణాలు కాపాడి ఆయన అమరుడయ్యాడని స్థానికులు సామాజిక మాధ్యమాల్లో అతడిని హీరోగా కీర్తిస్తున్నారు.

### పొంచి ఉన్న మరో ప్రమాదం

నేపాల్ వరదల వల్ల హిమానీనదం బద్దలై భారీ రాళ్లు, మంచుతో ఏర్పడిన సరస్సు పొంగుతోందని చైనా హెచ్చరించింది. ఆ సరస్సు నీటి రంగు ముదురు రంగులోకి మారుతోందని, ఏ క్షణమైనా అది దిగువకు దూసుకువచ్చే ప్రమాదం ఉందని నేపాల్ విదేశాంగ శాఖకు సమాచారం అందించింది.

# నేను నమ్మకద్రోహిని ఎలా అవుతా?

**నాటి కాంగ్రెస్ తో సజ్జలలా నేను సంధి చేసుకోలేదు**

**నమ్మకంగా ఉన్నందుకే పదిహేను నెలల జైలు జీవితం**

**వైసీపీ కోటరీ దుష్ప్రచారంపై విజయసాయి ఫైర్**



**అమరావతి (సమయం న్యూస్):** తాను ఏనాడూ నమ్మకద్రోహానికి పాల్పడలేదని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. తనను నమ్మకద్రోహి అంటూ వైఎస్సార్సీపీ కోటరీకి చెందిన సామాజిక మాధ్యమాలు దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం వేదికగా ఆయన ఒక బహిరంగ లేఖను విడుదల చేశారు. తానూ సజ్జల రామకృష్ణారెడ్డిలా ద్రోహినైతే నాటి కాంగ్రెస్ ప్రభుత్వంతో చీకటి ఒప్పందం చేసుకుని అభియోగ పత్రాల్లో పేరు లేకుండా చేసుకునేవాడినని తెలిపారు. జగన్ పట్ల నమ్మకంగా ఉన్నాననే కారణంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి కేసులో తన పేరు చేర్చిందని విజయసాయిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ పదహారు నెలలు జైలులో ఉంటే, తాను పదిహేను నెలలు కారాగారంలో ఉన్నానన్నారు. సంబంధం లేని మద్యం కుంభకోణంలో ఐదో నిందితుడిగా, కాకినాడ పోర్టు కేసులో రెండో నిందితుడిగా తనను చేర్చారని వాపోయారు. సకల శాఖల మంత్రి పేరు మాత్రం ఏ చార్జిషీట్‌లోనూ లేదని, ఆ విద్య తనకు తెలియదని ఎద్దేవా చేశారు. పార్టీ మారేందుకు సిద్ధమైన ఉత్తరాంధ్ర నేతతో కలిసి సజ్జల కుట్ర పన్నారని విజయసాయిరెడ్డి ఆరోపించారు. జగన్ కు అసత్యాలు చెప్పి తనను ఉత్తరాంధ్ర బాధ్యతల నుంచి తప్పించారన్నారు. జగన్ మెప్పు కోసమే సజ్జల నాస్తికుడిగా చెప్పుకున్నారని, ఆయన పార్టీకే కాక రాష్ట్రానికే ద్రోహి అని మండిపడ్డారు. రెండు వేల పంతొమ్మిది విజయం తర్వాత సజ్జల ప్రమేయం శృతిమించిందని, జగన్ ను ఎవరూ కలవకుండా గోడ కట్టింది ఆయనే కాదా అని నిలదీశారు.

# తెలుగు రైతుల ధాన్యం కొనుగోలుకు ఆమోదం!

- యాభై వేల మంది అన్నదాతలకు భారీ ఊరట
- సమస్యను పరిష్కరించిన ఎంపీ పురందేశ్వరి
- ఎంపీ దృష్టికి తీసుకెళ్లిన అనపర్తి ఎమ్మెల్యే
- ఒడిశా మంత్రులతో ఫోన్లో మాట్లాడిన ఎంపీ
- సహకరించిన గవర్నర్, మంత్రులకు కృతజ్ఞతలు



**రాజమహేంద్రవరం (సమయం న్యూస్):** ఒడిశా రాష్ట్రంలో వరి సాగు చేస్తున్న సుమారు యాభై వేల మంది తెలుగు రైతులు ఎదుర్కొంటున్న ధాన్యం కొనుగోలు సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. ఈ నిర్ణయం అన్నదాతలకు ఎంతో ఊరటనిస్తుందని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల పెదపూడి మండలానికి చెందిన పలువురు రైతులు ఒడిశాలో తాము సాగు చేస్తున్న వరి ధాన్యాన్ని అక్కడి ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో పడుతున్న ఇబ్బందులను అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. రైతుల సమస్యను తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి ఎంపీ పురందేశ్వరిని కలిసి పరిస్థితిని వివరించారు. దీనిని సానుకూలంగా పరిగణించిన ఎంపీ తక్షణమే ఒడిశా ప్రభుత్వంలోని సంబంధిత మంత్రులతో ఫోన్‌లో మాట్లాడి, తెలుగు రైతుల ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### ఒడిశా సర్కారు అంగీకారం

ఎంపీ పురందేశ్వరి విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన ఒడిశా ప్రభుత్వం తెలుగు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు అంగీకరించింది. దీంతో చాలా కాలంగా ఎదురుచూస్తున్న రైతులకు భారీ ఉపశమనం లభించింది. రైతుల సమస్యను తన దృష్టికి తీసుకువచ్చిన వెంటనే స్పందించి, ఒడిశా మంత్రులతో మాట్లాడి పరిష్కారం చూపిన పురందేశ్వరికి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి సహకరించిన ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, ఒడిశా మంత్రులు పృథ్వీరాజ్ హరిచందన్, కృష్ణ చంద్ర పాత్ర, కనక్ వర్ధన్ సింగ్ డియోలకు ఎంపీ పురందేశ్వరి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రైతులు ఏ రాష్ట్రంలో వ్యవసాయం చేసినా వారి కష్టానికి తగిన ఫలితం దక్కాలని, రైతుల సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన ప్రతి వేదికపైనా వారి తరఫున కృషి చేస్తానని ఆమె స్పష్టం చేశారు.

# విశాఖలో ఘోర విషాదం!

**ఒకే కుటుంబానికి చెందిన నలుగురి ఆత్మహత్య**

**పెందుర్తి మండలం చింతలగ్రహారంలో ఘటన**

**భార్య, ఇద్దరు పిల్లలకు ముందుగా విషమిచ్చి..**

**ఆపై తానూ బలవన్మరణానికి పాల్పడిన వినోద్**



**విశాఖపట్నం (సమయం న్యూస్):** విశాఖ జిల్లాలో ఘోర విషాదం చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. పెందుర్తి మండలం చింతలగ్రహారం కాలనీలో జరిగిన ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. మల్లా వినోద్ కుమార్ అనే వ్యక్తి తన భార్య, ఇద్దరు కుమార్తెలతో కలిసి బలవన్మరణానికి పాల్పడ్డాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. వినోద్ కుమార్ ముందుగా తన భార్య, ఇద్దరు కుమార్తెలకు విషం ఇచ్చి ఆ తర్వాత తానూ ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కుటుంబ సభ్యులు ఇంతటి కఠిన నిర్ణయం తీసుకోవడానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల విచారణలో వెల్లడి కావాల్సి ఉంది.

# పర్యాటక వైభవాన్ని ప్రపంచానికి చాటాలి!

**మంత్రి కందుల దుర్గేష్‌తో షంషేర్ సింగ్ రావత్ భేటీ**


**పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా రావత్ బాధ్యతలు**

**విజయవాడ (సమయం న్యూస్):** ఆంధ్రప్రదేశ్ పర్యాటక, సాంస్కృతిక శాఖ నూతన స్పెషల్ చీఫ్ సెక్రటరీగా సీనియర్ ఐఏఎస్ అధికారి షంషేర్ సింగ్ రావత్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాధ్యతలు చేపట్టిన నూతన అధికారికి మంత్రి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధి, సాంస్కృతిక రంగ పునరుద్ధరణపై ఇరువురూ సుదీర్ఘంగా చర్చించారు. పీపీపీ విధానంలో పెట్టుబడులను ఆకర్షించడం, పర్యాటక ఒప్పందాలను వేగవంతం చేయడంపై మంత్రి దుర్గేష్ దిశానిర్దేశం చేశారు. నూతన పర్యాటక పాలసీతో పాటు ఎస్ఐపీబీ ఆమోదించిన ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షించారు. దేశ విదేశాల్లో ఏపీ పర్యాటక వైభవాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని మంత్రి సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా మంత్రి నేతృత్వంలో పర్యాటక, సాంస్కృతిక రంగాల అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తానని ఎస్ఎస్ రావత్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



# స్వర్ణాంధ్ర నిర్మాణంలో భాగస్వాములు కండి!

**మలేషియా ప్రవాసాంధ్రులకు మంత్రి కొండపల్లి పిలుపు**




**అమరావతి (సమయం న్యూస్):** స్వర్ణాంధ్ర 2047 నిర్మాణంలో ప్రవాసాంధ్రులు భాగస్వాములు కావాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మలేషియాలోని పెనాంగ్ లో జరిగిన తెలుగు సంఘం (టామ్) 70వ ప్లాటినం జూబ్లీ వేడుకలకు శనివారం ఆయన రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఒక చిన్న విత్తనంలా ప్రారంభమైన ఈ సంఘం నేడు 5 లక్షల మందికి అండగా నిలవడం ప్రశంసనీయమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఏపీ ప్రభుత్వం అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి వంటి రంగాల్లో కొత్త అవకాశాలను సృష్టిస్తోందని వివరించారు.

### ప్రవాసాంధ్రులకు అండగా సర్కారు

రాష్ట్ర ప్రభుత్వం ప్రవాసాంధ్రుల రక్షణ, సంక్షేమానికి కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఏపీఎన్ఆర్టీఎస్ ద్వారా రూ.10 లక్షల ఉచిత ప్రమాద బీమా, నిరంతర హెల్ప్‌లైన్, ఎన్ఆర్ఐ సెల్ తో పాటు పెట్టుబడుల కోసం వన్ స్టాప్ సేవలు అందిస్తున్నామని తెలిపారు. సంబంధిత శాఖ మంత్రిగా ప్రవాస సోదరులకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. మలేషియా అభివృద్ధిలో భాగస్వాములవుతూనే తెలుగు గుర్తింపును విశ్వవ్యాప్తం చేశారని కొనియాడారు. మీకు ఏ అవసరం వచ్చినా రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

### పెట్టుబడులకు సరికొత్త విధానాలు

రాష్ట్రంలో రూ.30 లక్షల కోట్ల పెట్టుబడులు, 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఆరు నూతన పారిశ్రామిక విధానాలను ప్రవేశపెట్టామని కొండపల్లి వెల్లడించారు. ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు అమరావతి, విశాఖ, తిరుపతి, అనంతపురంలలో రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మలేషియాలోని తెలుగు పారిశ్రామికవేత్తలు తమ అనుభవాన్ని, సాంకేతిక పరిజ్ఞానాన్ని రాష్ట్ర పునర్నిర్మాణానికి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఆహార శుద్ధి, తయారీ, పర్యాటక, డిజిటల్ రంగాల్లో అపార అవకాశాలు ఉన్నాయని తెలిపారు. గడ్డ ఏదైనా మన మూలాలు ఆంధ్రప్రదేశ్‌లోనే ఉన్నాయని, రాష్ట్ర పారిశ్రామిక ప్రగతిలో ఎన్ఆర్ఐలు భాగస్వాములు కావాలని మంత్రి ఆకాంక్షించారు.

# సింహాద్రి అప్పన్న దేవస్థానంలో ముగ్గురు ఉద్యోగుల సస్పెన్షన్

**నిర్లక్ష్యంగా వ్యవహరించిన మరొకరికి షోకాజ్ నోటీసు**

**దర్శనం టికెట్ల పేరుతో మహిళా సిబ్బంది వసూళ్లు**

**మద్యం మత్తులో విధులకు హాజరైన మరో ఉద్యోగి**

**క్రమశిక్షణ తప్పిన వారిపై యాజమాన్యం కఠిన చర్యలు**



**విశాఖపట్నం (సమయం న్యూస్):** సింహాచలం అప్పన్న దేవస్థానంలో అవకతవకలకు పాల్పడిన, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ముగ్గురు ఉద్యోగులను అధికారులు సస్పెండ్ చేశారు. మరొక ఉద్యోగికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. దేవస్థానంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగి ఎన్.నయనారు భక్తుల నుంచి అక్రమంగా నగదు తీసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. రూ.300 దర్శనం క్యూలైన్ కోసం భక్తుల వద్ద డబ్బులు తీసుకుని వారికి టికెట్లు ఇవ్వలేదు. నీలాద్రి గుమ్మం వద్ద టికెట్ లేకుండా వచ్చిన భక్తులను అవుట్ సోర్సింగ్ సిబ్బంది ప్రశ్నించగా ఈ వ్యవహారం వెలుగుచూసింది. డబ్బులు చెల్లించినా తమకు టికెట్ ఇవ్వలేదని భక్తులు ఫిర్యాదు చేయడంతో అధికారులు కౌంటర్‌ను తనిఖీ చేశారు. నయనారు వద్ద లెక్కల్లో లేని రూ.4,700 అదనపు నగదును గుర్తించి ఆమెను సస్పెండ్ చేశారు. విధుల్లో ఉండగానే మద్యం సేవించారనే ఆరోపణలు రావడంతో బి.సన్యాసిరావు అనే ఉద్యోగిపై అధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న కె.అప్పలరాజు సైతం విధుల్లో తీవ్ర నిర్లక్ష్యం వహించినట్లు గుర్తించి అతడిని కూడా విధుల నుంచి తొలగించారు. ఆలయంలోని కీలకమైన కప్పస్తంభం వద్ద విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి అరుణ్ కుమార్ కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు అధికారులు గుర్తించారు. దీనిపై తక్షణమే వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేశారు.

## సంపాదకీయం




# నేపాల్‌లో సహాయక చర్యలే పెను సవాల్!

### వరద బురదలో కొనసాగుతున్న గాలింపు

### మృతదేహాల భద్రతకు మార్చురీల కొరత

ఆకస్మిక వరదలతో అతలాకుతలమైన నేపాల్‌లో ఇప్పుడు సహాయక చర్యలే పెను సవాల్‌గా మారాయి. ఊళ్లకు ఊళ్లు దెబ్బతినడం, రహదారులు, ఇతర మౌలిక వసతులు ధ్వంసం కావడంతో బురద తొలగింపు నుంచి గల్లంతైన వారి కోసం గాలింపు వరకు అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతున్నాయి. పర్యాటక రంగంపై ఎక్కువగా ఆధారపడే నేపాల్‌కు ఈ విపత్తు నుంచి పూర్తిగా కోలుకోవడం, ధ్వంసమైన ప్రాంతాలను పునర్నిర్మించడం దీర్ఘకాలిక సవాల్‌గా మారే పరిస్థితి కనిపిస్తోంది. అందుతున్న సమాచారం ప్రకారం వరదల్లో మృతుల సంఖ్య 600 దాటగా, 2,500 మందికి పైగా ఆచూకీ తెలియాల్సి ఉంది. గాలింపు చర్యలు కొనసాగుతున్న నేపథ్యంలో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో గల్లంతైన వారిని గుర్తించడంతో పాటు వెలికితీస్తున్న మృతదేహాలను భద్రపరచడం కూడా అధికారులకు పెద్ద సమస్యగా మారింది. నేపాల్‌లోని మార్చురీలన్నింటి సామర్థ్యం కలిపి సుమారు 350 మృతదేహాలకే పరిమితమని సమాచారం. మృతుల సంఖ్య ఇప్పటికే అంతకు మించిపోవడంతో ఆస్పత్రులు, మార్చురీలపై తీవ్ర ఒత్తిడి ఏర్పడింది. గల్లంతైన వారి కుటుంబ సభ్యులు వచ్చి గుర్తించే వరకు మృతదేహాలను భద్రపరిచేందుకు ప్రభుత్వం తాత్కాలిక కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. అక్కడ ఉష్ణోగ్రతను సుమారు సున్నా డిగ్రీల వద్ద ఉంచేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. సహాయక బృందాలు మృతదేహాలను వెలికితీసిన వెంటనే గుర్తింపు ప్రక్రియ చేపడుతున్నాయి. మృతదేహాల ఫొటోలు తీసి, అవసరమైతే శుభ్రపరిచిన అనంతరం ప్రత్యేక గుర్తింపు సంఖ్యతో కూడిన ట్యాగ్‌ను బాడీ బ్యాగ్‌కు అమర్చుతున్నారు. ఆ తర్వాత తాత్కాలిక భద్రతా కేంద్రాలకు తరలిస్తున్నారు. గల్లంతైన వారి కోసం వచ్చే కుటుంబ సభ్యులకు వెలికితీసిన మృతదేహాల ఫొటోలను చూపించి గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు. కుటుంబ సభ్యులు గుర్తించిన తర్వాత అవసరమైన అధికారిక ప్రక్రియను పూర్తి చేసి మృతదేహాన్ని అప్పగిస్తున్నారు. ముఖం ఆధారంగా గుర్తించడం సాధ్యం కాని మృతదేహాల విషయంలో వేలిముద్రలు, డీఎన్ఏ సహా అవసరమైన నమూనాలను సేకరిస్తున్నారు. వెంటనే గుర్తింపు సాధ్యం కాకపోయినా భవిష్యత్తులో శాస్త్రీయ పద్ధతుల్లో గుర్తించేందుకు వీటిని భద్రపరుస్తున్నారు. బంధువులు ఎవరూ ముందుకు రాని లేదా గుర్తించలేని మృతదేహాలను నిరవధికంగా భద్రపరచడం సాధ్యం కాకపోవడంతో.. అవసరమైన నమూనాలు సేకరించి, గుర్తింపు ట్యాగ్‌లు అమర్చిన తర్వాత నిబంధనల ప్రకారం తదుపరి ప్రక్రియ చేపడుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. గుర్తుతెలియని, ఎవరూ స్వీకరించని మృతదేహాల నిర్వహణకు జిల్లా స్థాయి యంత్రాంగం కేంద్ర అధికారులతో సమన్వయం చేసుకుంటోంది. విపత్తు తీవ్రత పెరగడంతో నేపాల్ విదేశీ సహాయక బృందాల సేవలను స్వీకరిస్తోంది. భారత్, చైనాకు చెందిన గాలింపు, సహాయక బృందాలను కొన్ని ప్రభావిత ప్రాంతాల్లోకి అనుమతిస్తున్నట్లు సమాచారం. గల్లంతైన విదేశీ పౌరుల కుటుంబాల ఆందోళనల నేపథ్యంలో నిపుణుల బృందాలు స్థానిక అధికారులతో కలిసి గాలింపు చర్యల్లో పాల్గొంటున్నాయి. ప్రస్తుతం గల్లంతైన వారిని గుర్తించడం, బాధితులను ఆదుకోవడం, మృతదేహాలను గుర్తించి కుటుంబాలకు అప్పగించడం తక్షణ ప్రాధాన్యంగా మారింది. అయితే ఆ తర్వాత నేపాల్ ముందున్న మరో భారీ సవాల్ పునర్నిర్మాణం. వరదల్లో దెబ్బతిన్న గ్రామాలు, రహదారులు, వంతెనలు, విద్యుత్, ఇతర మౌలిక వసతులను తిరిగి నిర్మించాల్సి ఉంది. వరద నీరు తగ్గినా నేపాల్ కష్టాలు మాత్రం తగ్గలేదు. బురదలో గల్లంతైన వారి కోసం గాలింపు ఒకవైపు.. మృతుల గుర్తింపు మరోవైపు.. ధ్వంసమైన ప్రాంతాల పునర్నిర్మాణం ఇంకోవైపు.. ఇప్పుడు ఆ చిన్న దేశం ముందున్నది సుదీర్ఘమైన పునరుద్ధరణ పోరాటమే.



# అది అంటరానితనానికి మరో రూపం

- ఖర్గే దళితుడైనందుకే మైదానం శుద్ధి చేశారా?
- బీజేపీ, ఆర్ఎస్ఎస్‌పై రాహుల్ గాంధీ ఆగ్రహం
- బాధ్యులపై కేసులు పెట్టి అరెస్ట్ చేయాలని డిమాండ్
- బీజేపీ, ఆర్ఎస్ఎస్‌పై తీవ్ర విమర్శలు
- హల్ద్వానీ ఘటనపై ముదిరిన వివాదం



**ఢిల్లీ, ఆగస్టు 29 :** ఉత్తరాఖండ్ 'శుద్ధీకరణ' ఘటనను లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తప్పుబట్టారు. భారతీయ జనతాపార్టీ, ఆర్ఎస్ఎస్‌లపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. భారతదేశంలో అస్పృశ్యతను చట్టబద్ధంగా నిషేధించారని, మల్లికార్జున ఖర్గే దళితుడనే కారణంతో ఇలా మైదానాన్ని శుద్ధి చేయడం ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం తీవ్రమైన నేరమని రాహుల్ పేర్కొన్నారు. శనివారం ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. 'శుద్ధీకరణ' సమాజంలో ఇంకా బతికే ఉన్న అంటరానితనానికి మరో పేరని ఆయన వ్యాఖ్యానించారు. శుద్ధీకరణ పూజను నిర్వహించిన వారిపై, దీనికి మద్దతు ఇచ్చిన ఉత్తరాఖండ్ స్థానిక బీజేపీ నేతలపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. దళితులు సమాజంలో ఎదగడం, గౌరవంగా బతకడం బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు ఇష్టం లేదని, ఈ ఘటన వారి కులవివక్ష భావజాలాన్ని స్పష్టం చేస్తోందని మండిపడ్డారు.

#### ఇంతకీ ఏం జరిగిందంటే..

ఆగస్టు 8వ తేదీన హల్ద్వానీలోని రాంలీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొన్నారు. ఖర్గే ర్యాలీ ముగిసిన రెండు రోజుల తర్వాత 'శ్రీరామ్ సేన' అనే స్థానిక సంస్థ ఆ మైదానంలో గంగాజలం చల్లి, హవనం (పూజ) నిర్వహించి మైదానాన్ని 'శుద్ధి' చేసింది. దీంతో వివాదం మొదలైంది.

# రెండు దేశాల పర్యటనకు ప్రధాని మోదీ!

### ఉజ్బెకిస్థాన్, కిర్గిజ్ రిపబ్లిక్ దేశాల్లో పర్యటన

### వాణిజ్యం, రక్షణ, డిజిటల్ రంగాలపై కీలక చర్చలు

### అభివృద్ధి ప్రణాళికలపై అభిప్రాయాల మార్పిడి

### 26వ షాంఘై సహకార సంస్థ సదస్సుకు హాజరు



**న్యూఢిల్లీ (సమయం న్యూస్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరో విదేశీ పర్యటనకు సిద్ధమయ్యారు. రెండు దేశాల పర్యటనలో భాగంగా ఆయన ఉజ్బెకిస్థాన్, కిర్గిజ్ రిపబ్లిక్ లో పర్యటించనున్నారు. ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్ ఆహ్వానం మేరకు ఆగస్టు 29, 30 తేదీల్లో మోదీ ఆ దేశంలో పర్యటిస్తున్నారు. తాష్కెంట్ లో ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై కీలక చర్చలు జరగనున్నాయి. ఉజ్బెకిస్థాన్ లో మోదీకి ఇది నాలుగో పర్యటన కావడం గమనార్హం. ఈ పర్యటనలో వ్యూహాత్మక భాగస్వామ్యంతో పాటు వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ రంగాల్లో పరస్పర సహకారంపై ఇరు దేశాల నేతలు చర్చించనున్నారు. డిజిటల్ అనుసంధానం, ఇంధనం, విద్య తదితర రంగాల్లో బంధాలను మరింత విస్తరించే అంశాలపైనా దృష్టి సారించనున్నారు. వికసిత్ భారత్ 2047, ఉజ్బెకిస్థాన్ 2030 అభివృద్ధి ప్రణాళికలపై అభిప్రాయాల మార్పిడి జరగనుంది. భవిష్యత్తులో ఆర్థిక, సాంకేతిక, మౌలిక వసతుల రంగాల్లో సహకారాన్ని పెంచుకునే అవకాశాలను పరిశీలిస్తారు. తాష్కెంట్ లోని లాల్ బహదూర్ శాస్త్రి స్మారక కేంద్రంతో పాటు ఓరియంటల్ స్టడీస్ విశ్వవిద్యాలయంలోని మహాత్మా గాంధీ కేంద్రాన్ని ప్రధాని సందర్శించనున్నారు. ఉజ్బెకిస్థాన్ పర్యటన అనంతరం ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 1 వరకు కిర్గిజ్ రిపబ్లిక్ లో మోదీ పర్యటించనున్నారు. ఆ దేశ అధ్యక్షుడు సదిర్ జపరోవ్ ఆహ్వానం మేరకు బిష్కెక్ కు వెళ్లనున్నారు. ఈ పర్యటనలో భాగంగా 26వ షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని పాల్గొంటారు. ఈ సంస్థ పాతిక వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈ సదస్సు జరుగుతోంది. 2017 నుంచి భారత్ ఇందులో పూర్తి స్థాయి సభ్య దేశంగా కొనసాగుతోంది. ఈ సమావేశంలో భద్రత, ప్రాంతీయ సహకారం, అభివృద్ధి అవకాశాలపై భారత ప్రాధాన్యతలను మోదీ ప్రస్తావించనున్నారు. శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ఆయా సభ్య దేశాల నేతలతో మోదీ ప్రత్యేకంగా ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉంది. కిర్గిజ్ రిపబ్లిక్ లో జరిగే ఆరవ ప్రపంచ నోమాడ్ క్రీడల ప్రారంభోత్సవానికి కూడా ప్రధాని హాజరుకానున్నారు. మధ్య ఆసియా సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలిచే ఈ క్రీడలు ప్రాంతీయ సంబంధాలకు ప్రత్యేక ప్రాధాన్యతను తీసుకురానున్నాయి.

# నేపాల్ వరదల్లో మరో విషాదం

### ఆచూకీ లేని ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్ సిఇవో

### లక్ష్మీనాథ్ గోపిశెట్టి ఆచూకీ కోసం ముమ్మర గాలింపు



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 29:** నేపాల్‌లో బీభత్సం సృష్టించిన ఆకస్మిక వరదల్లో ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్ సీఈఓ లక్ష్మీనాథ్ గోపిశెట్టి ఆచూకీ గల్లంతైంది. ఆయన వ్యక్తిగత పర్యటన నిమిత్తం నేపాల్‌కు వెళ్లినట్లు ఇన్ఫోసిస్ వెల్లడించింది. ప్రస్తుతం ఆయనతో సంబంధాలు తెగిపోయాయని, ఆచూకీ కోసం సంబంధిత అధికారులతో కలిసి గాలిస్తున్నామని తెలిపింది. గోపిశెట్టి కుటుంబ సభ్యులతో సంస్థ సంప్రదింపులు జరుపుతూ, వారికి అవసరమైన సాయాన్ని అందిస్తున్నట్లు పేర్కొంది. కాగా.. నేపాల్–చైనా సరిహద్దు ప్రాంతంలో ఈ నెల 26న సంభవించిన జల ప్రళయంలో పలు రహదారులు, వంతెనలు, భవనాలు కొట్టుకుపోయాయి. ముఖ్యంగా నేపాల్‌లోని రసువా జిల్లా, చైనాలోని టిబెట్ ప్రాంతాల్లో భారీ నష్టం వాటిల్లింది. సహాయక చర్యలకు ప్రతికూల వాతావరణం, దెబ్బతిన్న రవాణా, సమాచార వ్యవస్థలు సవాలుగా మారాయి. ఈ విపత్తు కారణంగా వందలాది మంది భారతీయుల ఆచూకీ గల్లంతైనట్లు భారత విదేశాంగ శాఖ తెలిపింది. సుమారు 320 మంది భారతీయులు ఇంకా అందుబాటులోకి రాలేదని వెల్లడించింది. అటు చైనాలో సుమారు 400 మంది భారతీయులు చిక్కుకున్నప్పటికీ సురక్షితంగా ఉన్నారంది. ఆయా కుటుంబ సభ్యులు వారితో కాంటాక్ట్‌లో ఉన్నారని తెలిపింది. చైనా వైపు చిక్కుకున్న వారిలో కొంతమంది ఇప్పటికే నేపాల్‌కు చేరుకున్నారు. తమిళనాడుకు చెందిన 21 మంది భారతీయులు కూడా సురక్షితంగా ఢిల్లీ చేరుకున్నారు. నేపాల్‌లో సహాయక చర్యలు కొనసాగుతుండగా, గల్లంతైన భారతీయుల ఆచూకీ కోసం భారత దౌత్య అధికారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. గోపిశెట్టి ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్‌కు నాయకత్వం వహిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలకు వ్యూహరచన, సాంకేతికత, కార్యకలాపాలు, డిజిటల్ పరివర్తనలో సలహాదారుడిగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఇన్ఫోసిస్‌లో గ్లోబల్ వైస్ ప్రెసిడెంట్‌గా, యాక్సెంచర్‌లో మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేశారు.

# ఢిల్లీలో పెరిగిన సీఎన్‌జీ ధరలు

### కిలోపై రూ.3.89 చొప్పున పెంపు





**న్యూఢిల్లీ, ఆగస్ట్ 29:** దేశ రాజధాని ఢిల్లీతో పాటు పరిసర ప్రాంతాల్లో సీఎన్‌జీ ధరలు మరోసారి పెరిగాయి. శనివారం ఉదయం 6 గంటల నుంచి కిలో సీఎన్‌జీపై రూ.3.89 చొప్పున పెంచుతున్నట్లు నగర గ్యాస్ పంపిణీ సంస్థ ఇంద్రప్రస్థ గ్యాస్ లిమిటెడ్ ప్రకటించింది. దీంతో ఢిల్లీలో ప్రస్తుతం కిలో సీఎన్‌జీ ధర రూ.86.98కి చేరుకుంది. అలాగే, నోయిడాలో రూ.95.59, ఘజియాబాద్‌లో రూ.95.59, గురుగ్రామ్‌లో రూ.92.01, మీరట్‌లో రూ.95.47, ముజఫర్‌నగర్‌లో రూ.95.47, షామ్లిలో రూ.95.47కు ధరలు చేరుకున్నాయి. పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు పెరగడం, అంతర్జాతీయ మార్కెట్లో ఎల్ఎన్‌జీ ధరలు భారీగా పెరగడం తాజా ధరల పెంపునకు ప్రధాన కారణమని ఐజీఎల్ వెల్లడించింది. పశ్చిమాసియా సంక్షోభం ప్రారంభమైన తర్వాత సీఎన్‌జీ ధరలు పెరగడం ఇది ఐదోసారి. మే 15 నుంచి ఇప్పటివరకు నాలుగు విడతల్లో ధరలు పెరిగాయి. తాజా పెంపుతో ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో వేలాది మంది సీఎన్‌జీ వాహనదారులపై అదనపు భారం పడనుంది. సీఎన్‌జీతో నడిచే ప్రైవేటు కార్లు, ట్యాక్సీలు, ఆటోలు, వాణిజ్య వాహనాల నిర్వహణ వ్యయం పెరగనుంది. దీంతో ఈ భారం చివరికి ప్రయాణికులపై పడనుంది. అంతర్జాతీయంగా ఎల్ఎన్‌జీ ధరలు సంక్షోభానికి ముందు స్థాయితో పోలిస్తే దాదాపు రెట్టింపయ్యాయని ఐజీఎల్ తెలిపింది. సీఎన్‌జీ సరఫరాకు అవసరమైన సహజ వాయువులో గణనీయమైన భాగాన్ని దిగుమతి చేసుకున్న ఎల్ఎన్‌జీ ద్వారానే సమకూర్చుకుంటున్నామని పేర్కొంది. హోర్ముజ్ జలసంధి మీదుగా ఎల్ఎన్‌జీ కార్గో రవాణాకు అంతరాయం ఏర్పడటంతో ధరలు ఒక్కసారిగా పెరిగాయని వివరించింది. అలాగే, శీతాకాలం సమీపిస్తుండటంతో యూరప్ దేశాలు సహజ వాయువు నిల్వలను పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని చెప్పింది. దీంతో ఎల్ఎన్‌జీ ధరలకు రెక్కలొచ్చి సీఎన్‌జీ సరఫరా వ్యయం గణనీయంగా పెరిగిందని పేర్కొంది. ఈ కారణంగానే రేట్లు పెంచాల్సిన పరిస్థితి నెలకొందని ఐజీఎల్ వెల్లడించింది.

# నేపాల్ వరదలపై మల్లికార్జున ఖర్గే ఆందోళన

### తక్షణ సాయం అందించాలని మోడీకి లేఖ

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 29:** నేపాల్‌లో సంభవించిన విధ్వంసకర వరదలపై కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు ఆయన లేఖ రాశారు. నేపాల్‌లో భారీ వరదల కారణంగా పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తి నష్టం సంభవించిందని ఖర్గే పేర్కొన్నారు. వరదల కారణంగా 500 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, దాదాపు 1,000 మందికి పైగా గల్లంతైనట్లు ఖర్గే తన లేఖలో తెలిపారు. వేలాది మంది ప్రజలు ఆహారం, మందులు, నివాసం, ఇతర అత్యవసర సదుపాయాల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విపత్కర పరిస్థితుల్లో భారత ప్రభుత్వం నేపాల్ ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని బాధితులకు అవసరమైన మానవతా, సహాయక చర్యలను అందించాలని ఖర్గే కోరారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను వేగవంతం చేసి, బాధితులకు అవసరమైన ఆహారం, మందులు, నివాసం వంటి అత్యవసర సదుపాయాలు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా వరదల కారణంగా నేపాల్‌లోని వివిధ ప్రాంతాల్లో భారతీయులు, భారతీయ మూలాలున్న వ్యక్తులు కూడా చిక్కుకుపోయారని ఖర్గే తెలిపారు. వారిని గుర్తించి సురక్షితంగా భారత్‌కు తరలించేందుకు రెస్క్యూ, తరలింపు చర్యలను ముమ్మరం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. నేపాల్‌లో నెలకొన్న విపత్కర పరిస్థితుల్లో భారత ప్రభుత్వం వేగంగా స్పందించి సహాయక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఖర్గే తన లేఖ ద్వారా స్పష్టం చేశారు. బాధిత ప్రజలకు మానవతా దృక్పథంతో అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందించాలని కేంద్రాన్ని కోరారు.



# ఉపాధ్యాయులకు ఘన సన్మానం!

- తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు
- మాతృభాష పరిరక్షణ, క్రీడల ప్రోత్సాహానికి పిలుపు
- విద్యార్థులు పద్యాలు నేర్చుకోవాలని సూచన



**ఒంగోలు, ఆగస్టు 29:** కోరు ఉప్పలపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మహిళా కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాష ఉపాధ్యాయులు ఈ.సింగారావు, ఆర్.వి.ఎస్.ప్రసాద్, క్రీడా ఉపాధ్యాయుడు ఏ.రవి కిరణ్ కుమార్‌లను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.సుసన్న కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కొండపి మండల విద్యాశాఖ అధికారులు సురేఖ, కోటిరెడ్డి, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా ట్రైనింగ్ కమిషనర్ కొనిజేటి వెంకట శేషారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ వేదికపై కొనిజేటి వెంకట శేషారావు మాట్లాడుతూ తెలుగు భాషా పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి విద్యార్థి కనీసం 25 పద్యాలను కంఠస్థం చేయాలని, తల్లి లాంటి మాతృభాషను ఎప్పటికీ విస్మరించకూడదని పేర్కొన్నారు. హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో ప్రతి పాఠశాల నుంచి నూతన క్రీడాకారులు వెలుగులోకి రావాలని, ఇందుకు సమాజం, ప్రభుత్వం సహకారం అందించాలని ఆకాంక్షించారు.

# భారీగా సింథటిక్ డ్రగ్స్ పట్టివేత!

- డీఆర్ఐ దాడుల్లో 18 కిలోల మాదకద్రవ్యాలు స్వాధీనం
- బెంగళూరు, పుణె నగరాల్లో నలుగురు నిందితుల అరెస్టు
- పక్షం రోజుల్లో 150 కిలోల డ్రగ్స్ సీజ్ చేసిన అధికారులు



**న్యూఢిల్లీ, ఆగస్టు 29 (సమయం న్యూస్):** సింథటిక్ మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు ఉక్కుపాదం మోపారు. బెంగళూరు, పుణె నగరాల్లో చేపట్టిన రెండు వేర్వేరు ఆపరేషన్లలో 18 కిలోలకు పైగా యాంఫెటమైన్, ఎండీఎంఏను స్వాధీనం చేసుకుని నలుగురు నిందితులను అరెస్టు చేశారు.

బెంగళూరు రైల్వే స్టేషన్‌లో ఓ మహిళ వద్ద 14.9 కిలోల యాంఫెటమైన్ లభ్యం కాగా, లోతైన దర్యాప్తు అనంతరం మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. పుణె జంక్షన్‌లో మరో మహిళ నుంచి 2.53 కిలోల యాంఫెటమైన్, 878 గ్రాముల ఎండీఎంఏ మాత్రలను స్వాధీనం చేసుకున్నారు. గత పక్షం రోజుల్లో ఐదు వేర్వేరు ఆపరేషన్ల ద్వారా డీఆర్ఐ అధికారులు సుమారు 150 కిలోల ఏటీఎస్ రకం డ్రగ్స్‌ను పట్టుకున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

# అమరావతిలో స్పోర్ట్స్ సిటీ రాబోతోంది

- 2,500 ఎకరాల్లో భారీ 'స్పోర్ట్స్ సిటీ', 'స్పోర్ట్స్ యూనివర్సిటీ'
- క్రీడా దినోత్సవ ముగింపు సభలో మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి




**తిరుపతి,ఆగస్ట్29:** అమరావతిలో స్పోర్ట్స్ సిటీ రాబోతోందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. అంతర్జాతీయ క్రీడా దినోత్సవ ముగింపు సభలో మాట్లాడుతూ.. భారతదేశానికే ఆదర్శంగా అమరావతిలో 2,500 ఎకరాల్లో భారీ 'స్పోర్ట్స్ సిటీ', 'స్పోర్ట్స్ యూనివర్సిటీ' ఏర్పాటు కానున్నాయని తెలిపారు. క్రీడలను ప్రోత్సహించటంలో భాగంగా సీఎం చంద్రబాబు.. ప్రముఖుల అకాడమీలను ప్రోత్సహిస్తున్నారన్నారు. పీవీ సింధు, పు÷-లలెల గోపీచంద్, కిదాంబి శ్రీకాంత్ వంటి ప్రముఖుల అకాడమీలకు ప్రభుత్వం నుంచి స్థల కేటాయించినట్లు చెప్పారు. అరకు నుంచి తిరుపతి వరకు, శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు గ్రామీణ స్థాయి ప్రతిభను వెలికితీసేందుకు 6 ప్రత్యేక అకాడమీలను ఏర్పాటు చేశామని మంత్రి వెల్లడించారు. భవిష్యత్తులో ప్రపంచంలో ఏ ఈవెంట్ జరిగినా ఏపీ నుంచి కనీసం ఒక క్రీడాకారుడైనా పాల్గొనాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విశాఖపట్నంలో ప్రధాని మోదీ సమక్షంలో జరిగిన ప్రపంచ యోగా దినోత్సవంలో 5 లక్షల మంది పాల్గొని ప్రపంచ రికార్డు సృష్టించారన్నారు. రాష్ట్రాన్ని 'హెల్దీ, వెల్దీ అండ్ హ్యాపీ స్టేట్'గా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన అని చెప్పుకొచ్చారు. జాతీయ క్రీడా దినోత్సవం(ధ్యాన్‌చంద్ జయంతి), తెలుగు భాషా దినోత్సవం(గిడుగు రామ్మూర్తి పంతులు

జయంతి) సందర్భంగా తిరుపతి వేదికగా క్రీడాకారులకు మంత్రి కొల్లు రవీంద్ర శుభాకాంక్షలు తెలియ జేశారు. రాబోయే 50 ఏళ్లకు సరిపడా అత్యుత్తమ క్రీడా మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. క్రీడాభివృద్ధి కోసం రాష్ట్రాన్ని 3 జోన్లుగా(వైజాగ్, అమరావతి, తిరుపతి) విభజన చేసినట్లు తెలిపారు. క్రీడా పరికరాల తయారీ కోసం నెల్లూరు పరిసరాల్లో 1,000 ఎకరాల్లో 'స్పోర్ట్స్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్' ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. తిరుపతిలో కేటాయించిన స్థలంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఆడిటోరియాలు, క్రీడా ప్రాంగణాల నిర్మాణం జరుగుతోందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సూచనల మేరకు పాఠశాలల గ్రౌండ్లను సీఎస్సార్ నిధులతో అభివృద్ధి చేసి, గ్రామీణ ప్రతిభను వెలికితీసేలా కార్యాచరణను రూపొందించనున్నట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వెల్లడించారు.

# బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం


### తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురిసే ఛాన్స్



**విశాఖపట్టణం,ఆగస్ట్29:** బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నదని.. ఈ అల్పపీడన ప్రభావంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మళ్లీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణ పరిస్థితులు వేగంగా మారుతున్నాయి. ముఖ్యంగా ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో నేడు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడొచ్చని అంచనా వేశారు. బంగాళాఖాతంలో సంభవిస్తున్న వాతావరణ మార్పుల కారణంగా వర్షాల తీవ్రత పెరిగే అవకాశం ఉందని, సెప్టెంబర్ 2 వరకు ఉత్తరాంధ్రతోపాటు రాయలసీమలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. తెలంగాణలోని పలు జిల్లాల్లో సైతం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. రానున్న 24 గంటల్లో హైదరాబాద్ నగరంలో ఆకాశం మేఘావృతమై ఉంటుందని, అప్పుడప్పుడు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొన్నది. వర్షాల నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు హెచ్చరించారు. ఉరుములు, మెరుపులు సంభవించే సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు, బహిరంగ ప్రదేశాలకు దూరంగా ఉండాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రైతులు వాతావరణ హెచ్చరికలకు అనుగుణంగా వ్యవసాయ పనులు చేపట్టాలని కోరారు. వర్షం కురుస్తున్న సమయంలో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# భారీగా మత్తు మాత్రలు పట్టివేత!

### 'ఆపరేషన్ వజ్ర 2.0'తో అంతర్రాష్ట్ర ముఠా గుట్టురట్టు
### 66.80 లక్షల సైకోట్రోపిక్ మాత్రలు స్వాధీనం
### నార్కోటిక్స్ అధికారుల తనిఖీల్లో నిందితుడు అరెస్ట్



**న్యూఢిల్లీ, ఆగస్టు 29 (సమయం న్యూస్):** 'ఆపరేషన్ వజ్ర 2.0'లో భాగంగా సెంట్రల్ బ్యూరో ఆఫ్ నార్కోటిక్స్ (సీబీఎన్) అధికారులు భారీ అంతర్రాష్ట్ర ఔషధ అక్రమ రవాణాను ఛేదించారు. చండీగఢ్‌ఉబడ్డి మార్గంలో ఉత్తరప్రదేశ్ రిజిస్ట్రేషన్ కలిగిన ట్రక్కును ఆకస్మికంగా తనిఖీ చేసి ఏకంగా 66,79,980 సైకోట్రోపిక్ మత్తు మాత్రలను స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో ఒకరిని అరెస్టు చేశారు. ట్రక్కులోని 120 పెట్టెలలో అల్ప్రాజోలమ్, ట్రామడాల్, నైట్రాజెపామ్, క్లోనాజెపామ్ మాత్రలను గుర్తించారు. వీటిలో అత్యధిక ప్యాకెట్లపై బ్యాచ్ నంబర్లు, తయారీ, గడువు ముగింపు తేదీలను ఉద్దేశపూర్వకంగా చెరిపివేసినట్లు అధికారులు గుర్తించారు. సరైన బిల్లులు, రవాణా పత్రాలు లేకుండా తరలిస్తున్న ఈ మాత్రలతో పాటు ట్రక్కును ఎన్డీపీఎస్ చట్టం కింద సీజ్ చేశారు. ఈ అక్రమ సరఫరా వెనుక ఉన్న తయారీ, పంపిణీ నెట్‌వర్క్‌ను గుర్తించేందుకు దర్యాప్తు ముమ్మరం చేసినట్లు అధికారులు వెల్లడించారు.

# కౌలురైతులదే అసలైన సంక్షోభం!

### ఆత్మహత్యల్లో కౌలుదారులే అధికమన్న డి.నరసింహారెడ్డి
### పథకాలు, రుణాలు అందక సాగుదారుల అవస్థలు
### ప్రభుత్వాలు తక్షణమే ఆదుకోవాలని డిమాండ్

**విజయవాడ, ఆగస్టు 29 (సమయం న్యూస్):** వ్యవసాయ రంగంలో కౌలు రైతులే తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని, అన్నదాతల ఆత్మహత్యల్లో వారి సంఖ్యే అత్యధికంగా ఉందని విశ్రాంత ఆచార్యులు డి.నరసింహారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో అమరుడు తరిమెల నాగిరెడ్డి 50వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన ప్రసంగించారు. వ్యవసాయ ఉత్పత్తిలో ఎటువంటి సంక్షోభం లేదని, అసలైన సంక్షోభం సాగుదారులకే ఉందని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 45 శాతం మంది కౌలు రైతులేనని ప్రభుత్వ నివేదికలు స్పష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు. భూమిలేని వారు, వ్యవసాయ కూలీలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల వారే అధికంగా కౌలు సాగు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు భూయజమానులకే చేరుతున్నాయని, వాస్తవంగా సాగు చేసే కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, పంట రుణాలు, రాయితీలు దక్కడం లేదని విమర్శించారు. మారుతున్న వ్యవసాయ పరిస్థితులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి కౌలు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సాగుదారుల సమస్యలను తరిమెల నాగిరెడ్డి అర్ధ శతాబ్దం క్రితమే గుర్తించారని గుర్తుచేశారు. టీఎన్ ట్రస్ట్ చైర్మన్ సింహాద్రి ఝాన్సీ అధ్యక్షతన జరిగిన ఈ సభలో పీడీఎస్‌వో రాష్ట్ర నాయకుడు సురేష్, ట్రస్ట్ కార్యదర్శి వీవీఎన్ బసవరావు తదితరులు పాల్గొన్నారు.

# పీపుల్ వుడ్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

**ఏలూరు, ఆగస్టు 29:** పీపుల్ వుడ్ స్కూల్ యాజమాన్యం పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం పీడీఎస్‌యు ఆధ్వర్యంలో స్థానిక ఆర్.ఐ.ఓ కార్యాలయంలో సూపర్డెంట్ డి.వి శ్రీనివాస్‌కి వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షులు కాకినాని అని మాట్లాడుతూ ఇంటర్మీడియట్ బోర్డు నుంచి ఎటువంటి ముందస్తు అనుమతులు తీసుకోకుండానే పీపుల్ వుడ్ కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్ పేరు మీద పెద్ద ఎత్తున పాంప్లెట్ ముద్రించి ప్రచారం చేసి ఎంపీసీ -130 మందిని, బైపిసి-30 అడ్మిషన్లు చేసి శాంతినగర్ లో గల7బిష్త్ర రోడ్డు లో పీపుల్ వుడ్ స్కూల్ బిల్డింగ్ లో గల 5బిష్త్ర ఫ్లోర్లో అనధికారికంగా క్లాసులు నిర్వహిస్తున్నారని ఇది ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనలకు విరుద్ధమని నాని తెలిపారు. రెండు నెలల నుంచి ఆ యొక్క బిల్డింగ్ లో ఇంటర్మీడియట్ క్లాసులు నడుపుతున్న ఆర్.ఐ.ఓ కి కనబడడం లేదా అని నాని ప్రశ్నించారు. ఈ యొక్క అనధికార క్లాసులు పైన సమగ్ర విచారణ జరిపి విద్యార్థుల భవిష్యత్తుతో కావాలని ఆటలాడుతున్న పీపుల్ వుడ్ స్కూల్ యాజమాన్యం పైన కఠినమైన చర్యలు తీసుకొని ఇంటర్మీడియట్ బోర్డుకి యాజమాన్యం ఫైన్ విధించే విధంగా చర్యలు తీసుకోవాలని నాని అధికారులను డిమాండ్ చేశారు. లేనిపక్షంలో చలో పీపుల్ వుడ్ స్కూల్ పిలుపును ఇస్తామని నాని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండి మహేష్, సిహెచ్ చరణ్, ఎం.సాయి వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాకారులకు ప్రధాని మోడీ శుభాకాంక్షలు

**న్యూఢిల్లీ,ఆగస్ట్29:** జాతీయ క్రీడల దినోత్సవం సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ క్రీడాభిమానులకు శుభాకాంక్షలు చెప్పారు. యువతరానికి స్ఫూర్తిగా నిలవడంలో క్రీడల ప్రాధాన్యతను పేర్కొన్నారు. నిబద్ధత కలిగిన ప్రతి క్రీడాకారుడిని ప్రశంసించారు. మేజర్ ధ్యాన్‌చంద్‌కు నివాళులర్పించారు. అలాగే భారత మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్ కూడా సోషల్ మీడియాలో శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఓ వీడియోను షేర్ చేశారు. ప్రతి క్రీడాకారుడికి.. మీ అంకితభావం, అభిరుచి, పట్టుదల అందరికీ గర్వకారణం. తరతరాలకు స్ఫూర్తినిచ్చే ప్రతిభావంతుడైన దిగ్గజ మేజర్ ధ్యాన్ చంద్‌కు నివాళులర్పిస్తున్నానని ప్రధాని మోదీ పేర్కొన్నారు. క్రీడలు అంటే కేవలం గెలవడం మాత్రమే కాదని నేనెప్పుడూ నమ్ముతా. కలలు కనడం, కష్టపడటం, ఎదురుదెబ్బలను తట్టుకొని ముందుకు సాగడం నేర్పిస్తాయి. జాతీయ క్రీడాదినోత్సవం నాడు యువతను మరింత ఎక్కువగా గేమ్స్ ఆడేలా ప్రోత్సహిద్దాం క్రికెటర్ శిఖర్ ధావన్ అన్నారు.

# ఆసియా క్రీడల ముంగిట భారత బృందానికి షాక్

## ప్రాక్టీస్‌లో గాయంతో నీరజ్ చోప్రా పోటీలకు దూరం

**న్యూఢిల్లీ,ఆగస్ట్29:** ఆసియా క్రీడల ముంగిట భారత బృందానికి షాక్ తగిలింది. జావెలిన్ స్టార్ నీరజ్ చోప్రా గాయపడ్డాడు. శిక్షణ సమయంలో అతడి చీలమండ లిగమెంట్‌కు గాయమైంది. దీంతో సెప్టెంబరులో జరగనున్న ఆసియా క్రీడలకు దూరం కానున్నాడు. ఈ విషయాన్ని నీరజ్ చోప్రా శనివారం సోషల్ మీడియా ద్వారా తెలియజేశాడు. ఎంతో కష్టపడిన తర్వాత లుసానె డైమండ్ లీగ్‌లో ఈ సీజన్‌లో అత్యుత్తమ (88.05 మీటర్లు)త్రోను అందుకున్నట్లు అనిపించింది. దురదృష్టవశాత్తు ఆ తర్వాత కొద్ది కాలానికే శిక్షణ సమయంలో నా చీలమండ వద్ద లిగమెంట్ చిట్లిపోయింది. వైద్యుడితోపాటు నా టీమ్‌తో చర్చించిన అనంతరం ఈ సీజన్‌లో మిగిలిన మ్యాచ్‌లకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాను. ఇది నిరాశ కలిగించే విషయం. నా ఆటలో రిథమ్‌ను అందుకునే దశకు చేరుకున్నానని భావిస్తున్న తరుణంలో ఇలా జరగడం బాధాకరం. ఇప్పుడు నా దృష్టి పూర్తిగా కోలుకోవడం, మరింత దృఢంగా తిరిగి రావడంపైనే ఉంది' అని నీరజ్ చోప్రా పేర్కొన్నాడు. ఈ గాయం కారణంగా సెప్టెంబరు 5న బ్రసెల్స్‌లో జరగనున్న డైమండ్ లీగ్ ఫైనల్‌కు కూడా నీరజ్ దూరంకానున్నాడు. సెప్టెంబరు 11 నుంచి 13 వరకు జరగనున్న ప్రపంచ అథ్లెటిక్స్ అల్టిమేట్ ఛాంపియన్‌షిప్స్‌లోనూ పాల్గొనడం లేదు. ఆసియా క్రీడలు సెప్టెంబరు 19 నుంచి జపాన్‌లో ప్రారంభంకానున్న విషయం తెలిసిందే.



# ధర్మపీఠం యాగశాల ప్రారంభం

**చింతలపూడి, ఆగస్టు 29:**ఆంధ్ర, తెలంగాణ సరిహద్దుల్లోని యర్రగుంటపల్లి సమీపంలో చినభద్రాద్రిగా పేరుగాంచిన రామునిగట్టు వద్ద నిర్మించిన విశ్వకర్మ పరమాత్మ దేవాలయానికి అనుబంధంగా నిర్మించిన యాగశాలను శ్రావణ పౌర్ణమి సందర్భంగా ఘనంగా ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ ధర్మపీఠం అధిష్ఠిత వర్గం , ఆలయ ధర్మకర్త బ్రహ్మశ్రీ పుల్లూరి సోమశేఖరాచార్యుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్మించిన ఈ యాగశాల ప్రారంభోత్సవం వైదిక మంత్రోచ్ఛారణల మధ్య నిర్వహించారు.

# చేతి వృత్తి దారుల జీవితాలలో మార్పు రావాలి

## సామాజిక ఆర్ధిక సంక్షేమం, ఆత్మగౌరవం కల్పించాలి

## చేతి వృత్తి దారుల డిమాండ్

## ఏలూరు రూరల్ మండలం తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

**ఏలూరు, ఆగస్టు 29:** కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న దుష్ట విధానాల నుండి చేతి వృత్తి దారుల జీవితాలలో మార్పు రావాలని, సామాజిక ఆర్ధిక సంక్షేమం, ఆత్మగౌరవం కల్పించాలని కోరుతూ చేతి వృత్తి దారులు చాటపర్రు గ్రామంలోని ఏలూరు రూరల్ మండల తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర పిలుపు మేరకు ఏలూరు జిల్లా చేతి వృత్తి దారుల సమాఖ్య ఆధ్వర్యంలో ధర్నా చేసి, తహసిల్దార్ జి విజయ కుమార్ రాజు కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా చేతి వృత్తి దారుల సమాఖ్య ఏలూరు జిల్లా కన్వీనర్ కడుపు కన్నయ్య, కో కన్వీనర్ పోటేలు పెంటయ్య, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చేతి వృత్తిదారుల సంక్షేమానికి స్వతంత్రంగా మంత్రిత్వ శాఖ ను ఏర్పాటు చేయాలని, చేతి వృత్తిదారులకు ఉప ప్రణాళికను ఏర్పాటు చేసి చట్టబద్ధతను కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి చేతి వృత్తి దారునికి వయసుతో నిమిత్తం లేకుండా 50శాతం సబ్సిడీతో 5 లక్షల రూపాయలు వరకు సొంత పూసి కత్తితో కార్పొరేషన్ ల ద్వారా రుణాలు అందజేయాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 50 సంవత్సరాల నిండిన ప్రతి చేతి వృత్తిదారునికి 6వేల రూపాయలు సామాజిక పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చేతి వృత్తిదారుల పిల్లలకు ఆశ్రమ పాఠశాలలో కేజీ నుండి పీజీ వరకు ఉచిత విద్య ను అందించాలని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని, వృత్తుల నిర్వహణకు అవసరమైన ముడిసరుకు, సౌకర్యాలు, సదుపాయాలు కల్పించాలని కోరారు. రజక, మత్స్య వృత్తిదారులకు చెరువులు మంజూరు చేయాలని, క్షౌర, రజక వృత్తిదారులకు 300 యూనిట్లు వరకు ఉచిత కరెంటు సౌకర్యం కల్పించాలని, 11 రకాల చేనేత వస్త్రాలకు చేనేత రిజర్వేషన్ చట్టం అమలు చేయాలని , గీత, వడ్డెర, ఎరుకుల, మేదర , కుమ్మరి వృత్తిదారులకు ప్రభుత్వం అన్ని రకాల సంక్షేమాలను, ఆర్థిక సహాయాన్ని అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. గొర్రెల మేకల పెంపకం దారుల సొసైటీలకు ఐదు ఎకరాల భూమి ఇవ్వాలని, అటవీ శాఖ అధికారుల వేధింపుల నుండి రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో వివిధ వృత్తులలో పనిచేస్తున్న వృత్తిదారులు కోరాడ నాగేశ్వరరావు, దాసరి రాము, గంటా వెంకట్రావు, నక్క అప్పయ్యమ్మ, కొమరపురి మంగ, అంబటి చిన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

# వక్ఫ్ సంస్థల పురోగతిపై చైర్మన్ అబ్దుల్ అజీజ్ సమీక్ష

**అమరావతి, ఆగస్టు 29:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ శనివారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఇన్‌స్పెక్టర్-ఆడిటర్లు, వక్ఫ్ అధికారులు, సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్ఫ్ సంస్థల సందర్శనలు, రికార్డుల నిర్వహణ, పెండింగ్ అంశాలు, కొనసాగుతున్న వివిధ కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాల వారీగా ఉన్న వక్ఫ్ సంస్థల సంఖ్య, ఇన్‌స్పెక్టర్-ఆడిటర్లు ఇప్పటివరకు సందర్శించిన సంస్థలు, సందర్శనలకు సంబంధించిన ఆధారాలు, ఇంకా సందర్శించాల్సిన సంస్థలు, వాటిని నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు రూపొందించిన కార్యాచరణ ప్రణాళికపై చర్చించారు. అలాగే, వివిధ విభాగాల పనితీరు, సమస్యలు, సవాళ్లు, పెండింగ్ అంశాలపై సంబంధిత విభాగాధిపతులతో చర్చించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలను సూచించారు.వక్ఫ్ ఆస్తుల క్షేత్రస్థాయి సమాచార సేకరణ, రికార్డుల ధృవీకరణ, డిజిటలైజేషన్ కోసం రూపొందించిన "ప్రాజెక్ట్ అమానహ్" పై చైర్మన్ ప్రత్యేకంగా సమీక్షించారు. ప్రతి వక్ఫ్ ఆస్తికి ప్రత్యేక ఐడీ కేటాయించి, ఆస్తి వివరాలు, భౌతిక స్థితి, ఫోటోలు, ఆక్రమణలు, న్యాయపరమైన అంశాలు, రికార్డుల వ్యత్యాసాలు తదితర సమాచారాన్ని ఆధారాలతో సేకరించి, ధృవీకరించిన డిజిటల్ రికార్డుగా రూపొందించడం ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యం. ప్రాజెక్ట్‌ను అమలు చేయడానికి ముందు 7 రోజుల పైలట్ ప్రాజెక్ట్ నిర్వహించనున్నారు. ఇందులో ఫీల్డ్ డేటా సేకరణ, ఫారమ్ వినియోగం, డేటా నాణ్యత, రిస్క్ గుర్తింపు, యాక్షన్ ట్రాకింగ్, జిల్లా స్థాయి డ్యాష్‌బోర్డ్ వంటి అంశాలను పరీక్షించి, అవసరమైన సవరణలు చేసిన అనంతరం ప్రాజెక్ట్‌ను అమలు చేయనున్నారు. అప్పగించిన పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, క్షేత్రస్థాయి పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని చైర్మన్ సిబ్బందికి సూచించారు. ప్రతి విభాగం సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈఓ యాఖూబ్ ఖాజీ, డీఈఈ అబ్దుల్ ఖాదర్, ఇన్‌స్పెక్టర్-ఆడిటర్లు, సెక్షన్ హెడ్‌లు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# పిఠాపురంలో వైద్య విప్లవం!

- రూ.34 కోట్లతో అత్యాధునిక ఏరియా ఆసుపత్రి
- రూ.100 కోట్లతో ఆయుష్ వైద్య కళాశాల ఏర్పాటు
- గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, క్యాన్సర్ సెంటర్ అభివృద్ధి



**పిఠాపురం (సమయం న్యూస్):** నాణ్యమైన వైద్యం ప్రతి ఒక్కరి హక్కు అనే గొప్ప ఆశయాన్ని ఆచరణలో సాకారం చేస్తూ పిఠాపురం నియోజకవర్గాన్ని సమగ్ర, అత్యున్నత ఆరోగ్య సేవలకు కేంద్రంగా, రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచే మోడల్ హెల్త్ హబ్‌గా ఉప ముఖ్యమంత్రి, స్థానిక శాసనసభ్యులు పవన్ కళ్యాణ్ తీర్చిదిద్దుతున్నారు. ప్రతి పేదవాడికీ ఎలాంటి ఆర్థిక భారం లేకుండా, అత్యున్నత ప్రమాణాలతో కూడిన కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు ఉచితంగా అందాలనే దృఢ సంకల్పంతో ఆయన ముందుకు సాగుతున్నారు. ఈ మహత్తర లక్ష్య సాధనలో భాగంగా ఆధునిక సదుపాయాలతో ఆసుపత్రుల అభివృద్ధి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల బలోపేతం, ఆయుష్ వైద్య సేవల విస్తరణతో పాటు వైద్య విద్యా సంస్థల ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. దీనితో పాటు రోగుల ప్రయాణ సౌకర్యార్థం ఈ ఆసుపత్రులన్నింటికీ కనెక్టింగ్ రోడ్లను కూడా నిర్మించారు.

## శరవేగంగా ఏరియా ఆసుపత్రి అభివృద్ధి

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీకి అనుగుణంగా పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధతో పిఠాపురంలోని 30 పడకల పాత కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను రూ.34 కోట్ల అంచనా వ్యయంతో 100 పడకల సామర్థ్యంతో కూడిన అత్యాధునిక ఏరియా ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తున్నారు. ఈ పనులు యుద్ధ ప్రాతిపాదికన సాగుతుండగా, ఇప్పటికే దాదాపు 50 శాతం నిర్మాణ పనులు పూర్తయ్యాయి. 4.67 ఎకరాల విస్తీర్ణంలో నిర్మితమవుతున్న ఈ అత్యాధునిక ఆసుపత్రిలో ఆధునిక ఐసీయూ, అధునాతన వైద్య పరీక్షా ప్రయోగశాలలు, ఆధునిక ఆపరేషన్ థియేటర్లు, 30 పడకల ప్రసూతి విభాగంతో పాటు చిన్నపిల్లల వైద్యం, కంటి వైద్యం, ఎముకల వైద్యానికి సంబంధించిన ప్రత్యేక విభాగాలు అందుబాటులోకి రానున్నాయి. ఆసుపత్రి నిర్మాణం పూర్తై ప్రజలకు అందుబాటులోకి వస్తే పిఠాపురం పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లోని ఆరు మండలాలకు చెందిన సుమారు 3 లక్షల మంది ప్రజలకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన ఉచిత, కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయి. ఆసుపత్రికి అనుబంధంగా బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ భవనం, మార్చురీ, లక్ష లీటర్ల సామర్థ్యం గల సంప్‌తో పాటు ఇతర అవసరమైన మౌలిక సదుపాయాల నిర్మాణం కూడా చేపడుతున్నారు.

## ప్రతిష్ఠాత్మక ప్రభుత్వ ఆయుష్ వైద్య కళాశాల

పిఠాపురం పేరును వైద్య విద్యా రంగంలో ప్రత్యేకంగా నిలబెట్టే లక్ష్యంతో, నేషనల్ ఆయుష్ మిషన్ కింద ప్రతిష్ఠాత్మక ప్రభుత్వ ఆయుష్ వైద్య కళాశాల ఏర్పాటుకు పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. సుమారు రూ.100 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ ఆయుష్ మెడికల్ కాలేజీతో పాటు అనుబంధ అభివృద్ధి పనుల కోసం పిఠాపురం నియోజకవర్గంలో భూసేకరణ పనులు వేగవంతం చేశారు. ఈ కళాశాల నిర్వహణ, అనుబంధ సేవలు, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా పెరగనున్నాయి.

## మెరుగైన ఆయుష్, హెల్త్ యూనిట్లు

పట్టణ ప్రాంతాలకే పరిమితం కాకుండా, గ్రామీణ ప్రజలకు కూడా తక్షణ వైద్య సేవలు అందించేలా యు. కొత్తపల్లి మండలం కొమరగిరిలో, గొల్లప్రోలు మండలం చేబ్రోలులో రూ.50 లక్షల చొప్పున వ్యయంతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఇప్పటికే వంద శాతం పూర్తయి అందుబాటులోకి వచ్చాయి. వీటితో పాటు విరవాడలో రూ.30 లక్షలతో నిర్మిస్తున్న ప్రభుత్వ ఆయుష్ డిస్పెన్సరీ పనులు చివరి దశకు చేరాయి.

అదే సమయంలో పిఠాపురం నియోజకవర్గానికే పరిమితం కాకుండా కాకినాడ జిల్లా ప్రజలకు అత్యున్నత వైద్య సేవలు అందుబాటులోకి రావాలనే లక్ష్యంతో పవన్ కళ్యాణ్ ప్రత్యేక కృషి చేస్తున్నారు. ఆయన చొరవతో కాకినాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో రూ.36.6 కోట్లతో అధునాతన క్యాన్సర్ చికిత్సా కేంద్రం ఏర్పాటు కానుంది. ఇందులో సీటీ సిమ్యులేటర్, హెచ్‌డీఆర్ బ్రాకీథెరపీ, డోసిమెట్రీ వంటి ఆధునిక పరికరాలతో పాటు, క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనాన్ని కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు.

గ్రామీణ స్థాయి ఆరోగ్య కేంద్రాల నుంచి అత్యాధునిక క్యాన్సర్ చికిత్స వరకు అన్ని వర్గాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు చేరువయ్యేలా ఆరోగ్య రంగాన్ని అభివృద్ధి చేస్తున్నారు. పిఠాపురం నియోజకవర్గంతో పాటు కాకినాడ జిల్లా ప్రజల ఆరోగ్య సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పవన్ కళ్యాణ్ తీసుకుంటున్న చర్యలు ప్రజారోగ్యంపై ఆయనకున్న ప్రత్యేక శ్రద్ధకు, కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

# మాతృభాషకు కూటమి సర్కారు పెద్దపీట!

- సెప్టెంబర్ మొదటి వారంలో నంది నాటకోత్సవాలపై ప్రకటన
- 19 మంది ప్రముఖులకు తెలుగు భాషా పురస్కారాలు
- విజయవాడలో ఘనంగా గిడుగు రామ్మూర్తి జయంతి వేడుకలు




**విజయవాడ, ఆగస్టు 29 (సమయం న్యూస్):** సెప్టెంబర్ మొదటి వారంలో నంది నాటకోత్సవాల నిర్వహణపై కీలక ప్రకటన చేస్తామని, ఏడాదిలోనే వీటిని కూటమి ప్రభుత్వం అత్యంత వైభవంగా నిర్వహిస్తుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. విజయవాడ గవర్నర్‌పేటలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్వరాజ్ మైదానంలో ఉన్న కళావేదికలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో తెలుగు వాడుక భాష ఉద్యమ పితామహుడు గిడుగు వేంకట రామమూర్తి పంతులు 163వ జయంతి (తెలుగు భాషా దినోత్సవం) వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కందుల దుర్గేష్ 19 మంది ప్రముఖులకు 'తెలుగు భాషా పురస్కారాలు-2026' అందజేశారు. పురస్కార గ్రహీతలకు ప్రశంసా పత్రం, జ్ఞాపికతో పాటు రూ.25,000 నగదును బహూకరించారు. అంతకుముందు ప్రజలు మాట్లాడే భాషకు విద్యా సాహిత్య రంగాల్లో సముచిత స్థానం కల్పించేందుకు కృషి చేసిన గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలనతో ఘన నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. గ్రంథాలకే పరిమితమైన తెలుగును ప్రజాక్షేత్రంలోకి తెచ్చిన మహోన్నతుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు అని కొనియాడారు. కందుకూరి, గురజాడ, గిడుగుల నిరంతర కృషి వల్లే వ్యావహారిక భాష ఉద్యమం రూపుదిద్దుకుందన్నారు. సవర భాషకు ప్రత్యేక లిపిని రూపొందించి, బ్రిటిష్ ప్రభుత్వం తనకు ఇచ్చిన పారితోషికాన్ని సైతం ఆదివాసీల విద్యాభివృద్ధికి వెచ్చించిన గొప్ప త్యాగధనుడు గిడుగు అని గుర్తుచేశారు. తెలుగు భాషా పురస్కారాల ఎంపికకు సంబంధించిన జీవోను సైతం తెలుగులోనే జారీ చేయడం కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు మాతృభాషకు విశేష ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. ప్రతి జిల్లాలో వ్యావహారిక భాషా సంఘాల ఏర్పాటుకు సాంస్కృతిక శాఖ తరఫున పూర్తి సహకారం ఉంటుందని, ఈ దిశగా తగిన చర్యలు తీసుకోవాలని అధికార భాషా సంఘం చైర్మన్‌కు సూచించారు. ఇతర భాషలు నేర్చుకోవడం అవసరమే అయినా, సొంత మాతృభాషను ఎట్టిపరిస్థితుల్లోనూ విస్మరించకూడదని పిలుపునిచ్చారు. కన్నతల్లి పాలతో పెరిగిన బిడ్డను మాతృభాషతో, పోత పాలతో పెరిగిన బిడ్డను పరాయి భాషతో పోలుస్తూ ప్రాథమిక విద్య తెలుగులోనే సాగాలని నొక్కిచెప్పారు. ప్రతి ఏటా ఉగాది, కందుకూరి, తెలుగు భాషా పురస్కారాలను క్రమం తప్పకుండా ప్రదానం చేస్తామని వెల్లడించారు.

పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి షంషేర్ సింగ్ రావత్ మాట్లాడుతూ.. తెలుగు భాషకు పూర్వవైభవం తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తెలుగులో రాయడం, మాట్లాడడం, చదవడాన్ని అలవర్చుకున్నప్పుడే గిడుగు రామమూర్తి పంతులు ఆశయాలు నెరవేరుతాయని అన్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలో పని చేస్తుండటం వల్ల తనకు తెలుగు భాషపై గౌరవం మరింత పెరిగిందన్నారు. గిడుగు రామమూర్తి పంతులు సాగించిన పోరాట ఫలితంగానే నేడు సామాన్య ప్రజలకు సైతం భాష ఎంతో చేరువైందని కొనియాడారు.

సాంస్కృతిక సృజనాత్మక సమితి చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి మాట్లాడుతూ.. తెలుగు భాషా పరిరక్షణకు కృషి చేసిన మహనీయుల చరిత్రను భావితరాలకు అందించాలని కోరారు. గిడుగు జీవితాంతం చేసిన ఉద్యమ ఫలమే నేడు మనం చదువుకుంటున్న సాహిత్యం, కావ్యాలు, పాఠ్యాంశాలని స్పష్టం చేశారు. భాషా వికాసానికి కృషి చేస్తున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ.. నాటకరంగం ద్వారానే భాష ప్రజల హృదయాలకు మరింత చేరువైందని, త్వరలోనే నంది నాటకోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు.

మండలి వెంకటకృష్ణారావు అధికార భాషా సంఘం చైర్మన్ పూల త్రివిక్రమ్ రావు మాట్లాడుతూ.. వాడుక భాషా వ్యాప్తికి గిడుగు రామమూర్తి పంతులు తమ జీవితాన్ని ధారపోశారన్నారు. కందుకూరి, గురజాడ, గిడుగులతో పాటు సీపీ బ్రౌన్, పొట్టి శ్రీరాములు, ఎన్టీఆర్ వంటి మహనీయులు తెలుగుకు అందించిన సేవలు అనన్యమైనవని గుర్తుచేశారు. నగరాల్లోని నామఫలకాలు తెలుగులోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరినట్లు వెల్లడించారు. ప్రతి ఇంట్లో తెలుగు వినిపించేలా సభా సంఘాల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు.

## పుస్తకావిష్కరణ - పురస్కారాల ప్రదానం

ఈ వేదికపై గిడుగు వేంకట రామమూర్తి పంతులు మునిమనవడు నాగేశ్వరరావు రచించిన 'కావ్య మల్లికలు' పుస్తకాన్ని మంత్రి కందుల దుర్గేష్ ఆవిష్కరించారు. అనంతరం తెలుగు భాషా పురస్కారాలు అందుకున్న జంధ్యాల కనకదుర్గ, చందలూరి నారాయణరావు, యు.భూదేవి, కె.పుష్ప, ముత్తేవి రవీంద్రనాథ్, బాలాంతపు వెంకట రమణ, అబ్దుల్ హకీమ్ జాని, ఎస్.వి. రాఘవేంద్రరావు, పి.విజయ్ కుమార్, బొగ్గవరపు మాల్యాద్రి, చిలుకూరి శ్రీనివాసరావు, నాగసూరి వేణుగోపాలరావు, జంధ్యాల శరత్ బాబు, కోయి కోటేశ్వరరావు, కే.వి.ఎల్.ఎన్. శర్మ, ఎం.రామకృష్ణ, వీవీఐటీయూ పుస్తక ప్రచురణ సంస్థ, వేమూరి శ్రీనివాస్, కొల్లి రమావతి తదితరులు మాట్లాడుతూ తమ సేవలను గుర్తించి సత్కరించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

అంతకుముందు కళావేదిక వద్దకు విచ్చేసిన మంత్రి కందుల దుర్గేష్‌కు జానపద నృత్యాలతో ఘన స్వాగతం పలికారు. కళావేదిక ప్రాంగణంలో ఉన్న తెలుగు తల్లి విగ్రహానికి ఆయన పూలమాల వేసి నమస్కరించారు. ఈ కార్యక్రమంలో 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, జానపద అకాడమీ చైర్మన్ వంపూరు గంగులయ్య, సాంఘిక సంక్షేమ బోర్డు చైర్మన్ పోతుల బాలకోటయ్య, గిడుగు మునిమనవడు నాగేశ్వరరావు, పెద్ద సంఖ్యలో భాషాభిమానులు పాల్గొన్నారు.

# వ్యతిరేకించే ముందు.. విషయం తెలుసుకోండి!

- కాప్ విమర్శలకు అనయా బంగర్ ఘాటు బదులు
- నిబంధనల మేరకే అర్హత పొందానని స్పష్టీకరణ
- ప్రీమియర్ క్రికెట్‌తో పునరాగమనానికి సన్నాహాలు
- భవిష్యత్తులో మహిళల బిగ్‌బాష్ లీగ్ లక్ష్యం
- ఉన్నతస్థాయి క్రికెట్‌కు ఇంకా నిరూపించుకోవాల్సిందే





**సిడ్నీ, ఆగస్టు 29:** మహిళల క్రికెట్‌లోకి తిరిగి వచ్చేందుకు ప్రయత్నిస్తున్న అనయా బంగర్ తనపై వచ్చిన విమర్శలకు స్పందించింది. క్రికెట్ ఆస్ట్రేలియా నిర్ణయాన్ని తప్పుబట్టిన దక్షిణాఫ్రికా స్టార్ ఆల్‌రౌండర్ మారిజానే కాప్ వ్యాఖ్యలకు బదులిస్తూ.. "వ్యతిరేకించే ముందు పూర్తి వివరాలు తెలుసుకోండి" అని సూచించింది. తనకు ఎలాంటి అనుచిత ప్రయోజనం లేదని, క్రికెట్ ఆస్ట్రేలియా నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగానే ముందుకు సాగుతున్నానని పేర్కొంది. అనయా మహిళల క్రికెట్‌లో ఆడేందుకు అవకాశం కల్పించడంపై ఇటీవల కాప్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. క్రికెట్ ఆస్ట్రేలియా నిర్ణయాన్ని ఆమె తప్పుబట్టింది. ఈ నేపథ్యంలో స్పందించిన అనయా.. తన అర్హతకు సంబంధించిన సమాచారాన్ని ఇప్పటికే అందుబాటులో ఉంచినట్లు తెలిపింది. ఈ అంశంపై అభిప్రాయం వ్యక్తం చేసేవారు ముందుగా సంబంధిత నిబంధనలు, వివరాలను పూర్తిగా అర్థం చేసుకోవాలని కోరింది. క్రికెట్ ఆస్ట్రేలియా నుంచి లభించిన అనుమతితో తనకు నేరుగా ప్రొఫెషనల్ జట్టులో చోటు దక్కినట్లు కాదని అనయా స్పష్టం చేసింది. ప్రస్తుతం ఆస్ట్రేలియాలోని రాష్ట్ర లేదా టెరిటరీ స్థాయిలో ప్రీమియర్ క్రికెట్ ఆడేందుకు అవకాశం లభించిందని తెలిపింది. కొన్ని స్థానిక క్లబ్‌లతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. భవిష్యత్తులో మహిళల బిగ్‌బాష్ లీగ్‌లో ఆడటమే తన ప్రధాన లక్ష్యమని అనయా పేర్కొంది. అయితే అందుకు ముందు క్లబ్ క్రికెట్‌లో రాణించడం, ఫిట్‌నెస్ సాధించడం, తన ఆటతీరుతో సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించడం అవసరమని తెలిపింది. తన విషయంలో క్రికెట్ ఆస్ట్రేలియా నిర్ణయం సాధారణ ప్రక్రియలో తీసుకున్నది కాదని అనయా పేర్కొంది. తన వైద్య వివరాలు, శస్త్రచికిత్స చరిత్ర, హార్మోన్, టెస్టోస్టెరాన్ నివేదికలు, క్రికెట్ నేపథ్యం, మ్యాచ్ దృశ్యాలు తదితర అంశాలను పరిశీలించినట్లు తెలిపింది. మాంచెస్టర్ మెట్రోపాలిటన్ యూనివర్సిటీకి చెందిన క్రీడా సంస్థకు సంబంధించిన శాస్త్రీయ, అథ్లెటిక్ పనితీరు సమాచారాన్ని కూడా పరిగణనలోకి తీసుకున్నట్లు పేర్కొంది. జూలైలో నిర్వహించిన రక్త పరీక్షలో తన మొత్తం టెస్టోస్టెరాన్ స్థాయి లీటరుకు 0.6 నానోమోల్‌గా నమోదైందని వెల్లడించింది. అనయా ఉన్నతస్థాయి క్రికెట్‌లోకి తిరిగి వచ్చే అవకాశం భవిష్యత్తులో అమల్లోకి వచ్చే అర్హత నిబంధనలపై ఆధారపడి ఉంటుందని పేర్కొంది. అప్పటివరకు కమ్యూనిటీ లేదా ప్రీమియర్ స్థాయి క్రికెట్‌లో కొనసాగేందుకు అవకాశం ఉందని తెలిపింది. అందువల్ల ప్రస్తుత అనుమతిని మహిళల బిగ్‌బాష్ లీగ్ ఒప్పందంగా లేదా ప్రొఫెషనల్, జాతీయ జట్టులో ఎంపికగా భావించకూడదని స్పష్టం చేసింది. తన వ్యక్తిగత ప్రయాణం గురించి కూడా అనయా స్పందించింది. చాలాకాలం పాటు తాను "సర్వైవల్ మోడ్"లో జీవించానని, గతంలో ఎదురైన పరిణామాలను ఇప్పుడు నెమ్మదిగా అర్థం చేసుకుంటూ జీవితాన్ని తిరిగి సర్దుబాటు చేసుకుంటున్నానని పేర్కొంది. ఇకపై ఒక్కో చిన్న అడుగు వేస్తూ తన క్రికెట్ ప్రయాణాన్ని తిరిగి నిర్మించుకోవాలని భావిస్తున్నట్లు తెలిపింది.



# క్రీడాకారులకు మోడీ శుభాకాంక్షలు

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 29 :** జాతీయ క్రీడల దినోత్సవం సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ క్రీడాభిమానులకు శుభాకాంక్షలు చెప్పారు. యువతరానికి స్ఫూర్తిగా నిలవడంలో క్రీడల ప్రాధాన్యతను పేర్కొన్నారు. నిబద్ధత కలిగిన ప్రతి క్రీడాకారుడిని ప్రశంసించారు. మేజర్ ధ్యాన్‌చంద్‌కు నివాళులర్పించారు. అలాగే భారత మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్ కూడా సోషల్ మీడియాలో శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఓ వీడియోను షేర్ చేశారు. ప్రతి క్రీడాకారుడికి.. మీ అంకితభావం, అభిరుచి, పట్టుదల అందరికీ గర్వకారణం. తరతరాలకు స్ఫూర్తినిచ్చే ప్రతిభావంతుడైన దిగ్గజ మేజర్ ధ్యాన్ చంద్‌కు నివాళులర్పిస్తున్నానని ప్రధాని మోదీ పేర్కొన్నారు. క్రీడలు అంటే కేవలం గెలవడం మాత్రమే కాదని నేనెప్పుడూ నమ్ముతా. కలలు కనడం, కష్టపడటం, ఎదురుదెబ్బలను తట్టుకొని ముందుకు సాగడం నేర్పిస్తాయి. జాతీయ క్రీడాదినోత్సవం నాడు యువతను మరింత ఎక్కువగా గేమ్స్ ఆడేలా ప్రోత్సహిద్దాం క్రికెటర్ శిఖర్ ధావన్ అన్నారు.

# 47 ఏళ్లకు అరంగేట్రం..

## 51 ఏళ్ల వయసులో ప్రపంచ రికార్డు..

### క్రికెట్‌లో 96 ఏళ్ల రికార్డు బద్దలు

**బుకారెస్ట్:** అంతర్జాతీయ క్రికెట్‌లో మరో అరుదైన రికార్డు నమోదైంది. ఐల్ ఆఫ్ మ్యాన్‌కు చెందిన 51 ఏళ్ల స్పిన్నర్ జోయాన్నే హిక్స్ ఏకంగా 96 ఏళ్లుగా చెక్కుచెదరకుండా ఉన్న రికార్డును బద్దలు కొట్టారు. పురుషులు, మహిళలు అనే తేడా లేకుండా అంతర్జాతీయ క్రికెట్‌లో ఐదు వికెట్ల ఘనత సాధించిన అత్యంత వయసైన బౌలర్‌గా చరిత్ర సృష్టించారు.



### 51 ఏళ్ల వయసులో అద్భుత బౌలింగ్

రొమేనియాలోని మొయారా వ్లాసియే క్రికెట్ గ్రౌండ్‌లో గ్రీస్ మహిళలతో జరిగిన టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లో జోయాన్నే హిక్స్ అద్భుత ప్రదర్శన చేశారు. 51 సంవత్సరాల 173 రోజుల వయసులో బరిలోకి దిగిన ఆమె కేవలం 10 పరుగులు ఇచ్చి ఐదు వికెట్లు పడగొట్టారు. ఇది హిక్స్ కెరీర్‌లోనే అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన. అంతేకాకుండా టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో ఆమెకు ఇది మూడో ఐదు వికెట్ల ఘనత కావడం విశేషం.

### 5/10తో గ్రీస్ బ్యాటింగ్‌ను కుప్పకూల్చిన హిక్స్

హిక్స్ స్పిన్ ధాటికి గ్రీస్ బ్యాటింగ్ లైనప్ పూర్తిగా కుప్పకూలింది. ఆమె ఐదు వికెట్లు తీసుకోవడంతో గ్రీస్ జట్టు కేవలం 15 ఓవర్లలో 52 పరుగులకే ఆలౌట్ అయింది. అనంతరం 53 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించేందుకు ఐల్ ఆఫ్ మ్యాన్ జట్టుకు పవర్‌ప్లే సమయం కూడా పూర్తిగా అవసరం కాలేదు. కేవలం తొమ్మిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో హిక్స్ వ్యక్తిగత రికార్డుతో పాటు జట్టు విజయానికి కూడా కీలకంగా మారారు.

### 96 ఏళ్లుగా ఉన్న బెర్ట్ ఐరన్‌మోంగర్ రికార్డు బద్దలు

జోయాన్నే హిక్స్ సాధించిన ఘనతతో 96 ఏళ్ల క్రితం నమోదైన రికార్డు తెరమరుగైంది. అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యంత వయసులో ఐదు వికెట్లు తీసిన బౌలర్‌గా ఇంతకాలం ఆస్ట్రేలియా మాజీ స్పిన్నర్ బెర్ట్ ఐరన్‌మోంగర్ పేరు మీద రికార్డు ఉంది. 1932లో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టు మ్యాచ్‌లో ఐరన్‌మోంగర్ 49 సంవత్సరాల 314 రోజుల వయసులో ఐదు వికెట్ల ఘనత సాధించారు. ఇప్పుడు 51 సంవత్సరాల 173 రోజుల వయసులో హిక్స్ ఐదు వికెట్లు తీసి ఆ రికార్డును అధిగమించారు.

### ఒకే రోజు ఐరన్‌మోంగర్ రెండు ఫైవ్ వికెట్ల హాల్స్

1932లో దక్షిణాఫ్రికాతో జరిగిన ఆ మ్యాచ్‌లో బెర్ట్ ఐరన్‌మోంగర్ అద్భుత ప్రదర్శన చేశారు. ఒకే రోజు రెండు ఇన్నింగ్స్‌లలోనూ 5వికెట్లకు పైగా తీశారు. తొలి ఇన్నింగ్స్‌లో 6పరుగులకు 5 వికెట్లు, రెండో ఇన్నింగ్స్‌లో 18 పరుగులకు 6 వికెట్లు పడగొట్టారు. ఆ మ్యాచ్‌లో దక్షి ణాఫ్రికా 36, 45 పరుగులకే ఆలౌట్ కాగా, ఆస్ట్రేలియా 153 పరుగులు చేసి ఇన్నింగ్స్ తేడాతో ఘన విజయం సాధించింది.

### 47 ఏళ్ల వయసులో అంతర్జాతీయ అరంగేట్రం

జోయాన్నే హిక్స్ అంతర్జాతీయ కెరీర్ కూడా ఎంతో ప్రత్యేకమైనది. ఆమె ఏకంగా 47 ఏళ్ల వయసులో ఐల్ ఆఫ్ మ్యాన్ తరఫున అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేశారు. 2024లో గ్రీస్, మాల్టాతో జరిగిన మ్యాచ్‌ల్లో ఆరు రోజుల వ్యవధిలోనే రెండు ఐదు వికెట్ల ఘనతలు సాధించారు. మాల్టాపై ఐదు వికెట్లు తీసినప్పుడు ఆమె వయసు 49 సంవత్సరాల 168 రోజులు. దీంతో అంతర్జాతీయ క్రికెట్‌లో ఐదు వికెట్లు తీసిన అత్యంత వయసైన మహిళా బౌలర్‌గా అప్పట్లో రికార్డు సృష్టించారు.

### ఇప్పుడు మహిళల రికార్డును దాటి ప్రపంచ రికార్డు

తాజా ప్రదర్శనతో హిక్స్ మరో మెట్టు ఎక్కారు. ఇప్పటివరకు మహిళల విభాగంలో మాత్రమే ఉన్న ఆమె రికార్డు.. ఇప్పుడు పురుషులు, మహిళలు అనే తేడా లేకుండా అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యంత వయసులో ఐదు వికెట్లు సాధించిన బౌలర్‌గా మారింది. కేవలం 10 పరుగులకే ఐదు వికెట్లు తీసి గ్రీస్ బ్యాటింగ్‌ను కుప్పకూల్చడంతో పాటు, ఐల్ ఆఫ్ మ్యాన్‌కు ఘన విజయాన్ని అందించడంలో కీలక పాత్ర పోషించారు. 51 ఏళ్ల వయసులో జోయాన్నే హిక్స్ సాధించిన ఈ ఘనత అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోనుంది.

# 7 పరుగులకే ఆలౌట్

## ఇదేం బ్యాటింగ్ బాబోయ్!

### టీ20 చరిత్రలో అత్యల్ప స్కోర్లివే

### 10 పరుగులకే కుప్పకూలిన రెండు జట్లు

### చెత్త రికార్డులో ఐవరీ కోస్ట్ అగ్రస్థానం

### మంగోలియా ఖాతాలోనూ రెండు దారుణ స్కోర్లు

స్పోర్ట్స్ డెస్క్: టీ20 క్రికెట్ అంటేనే ధనాధన్ సిక్సర్లు.. ఫోర్ల వర్షం.. మెరుపు అర్ధశతకాలు. బ్యాటర్లు బౌలర్లపై విరుచుకుపడి భారీ స్కోర్లు సాధించడం ఈ పొట్టి ఫార్మాట్‌లో సర్వసాధారణం. కానీ కొన్నిసార్లు పరిస్థితి పూర్తిగా తలకిందులవుతుంది. భారీ షాట్లు కొట్టేందుకు బరిలోకి దిగిన బ్యాటర్లు కనీసం క్రీజులో నిలబడలేక ఒక్కొక్కరుగా పెవిలియన్‌కు క్యూ కట్టిన సందర్భాలూ ఉన్నాయి. అంతర్జాతీయ టీ20 చరిత్రలో కొన్ని జట్లు కనీసం రెండంకెల స్కోరును కూడా అందుకోలేక అత్యంత దారుణ రికార్డులను మూటగట్టుకున్నాయి. ఈ అవాంఛనీయ రికార్డులో ఐవరీ కోస్ట్ అగ్రస్థానంలో ఉంది. 2024 నవంబర్ 24న నైజీరియాతో జరిగిన మ్యాచ్‌లో లక్ష్య ఛేదనకు దిగిన ఐవరీ కోస్ట్ బ్యాటర్లు పూర్తిగా చేతులెత్తేశారు. ప్రత్యర్థి బౌలర్ల ధాటికి కేవలం 7.3 ఓవర్లలోనే 7 పరుగులకు ఆలౌటయ్యారు. అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో అత్యల్ప జట్టు స్కోరుగా ఇది నమోదైంది. రెండో అత్యల్ప స్కోరు రికార్డును మంగోలియా, ఐల్ ఆఫ్ మ్యాన్ పంచుకున్నాయి. 2024 సెప్టెంబర్ 5న సింగపూర్‌తో జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన మంగోలియా.. ప్రత్యర్థి బౌలింగ్‌ను ఎదుర్కోలేక 10 ఓవర్లలో 10 పరుగులకే ఆలౌటైంది. 2023 ఫిబ్రవరి 26న స్పెయిన్‌తో జరిగిన మ్యాచ్‌లో ఐల్ ఆఫ్ మ్యాన్ పరిస్థితి కూడా ఇలాగే తయారైంది. స్పెయిన్ బౌలర్ల ధాటికి 8.4 ఓవర్లలో 10 పరుగులకే కుప్పకూలింది. ఆ స్వల్ప లక్ష్యాన్ని స్పెయిన్ సునాయాసంగా ఛేదించింది. ఈ జాబితాలో మంగోలియా మరోసారి చోటు దక్కించుకుంది. 2024 మే 8న జపాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 8.2 ఓవర్లలోనే 12 పరుగులకు ఆలౌటైంది. దీంతో అంతర్జాతీయ టీ20ల్లో అత్యల్ప స్కోర్ల జాబితాలో మంగోలియా పేరు రెండుసార్లు నమోదైంది. ఐవరీ కోస్ట్ కూడా మరోసారి ఈ అవాంఛనీయ జాబితాలో చేరింది. 2026 మే 24న రువాండాతో జరిగిన మ్యాచ్‌లో 15.2 ఓవర్ల పాటు క్రీజులో ఉన్నప్పటికీ 17 పరుగులకే ఆలౌటైంది. దీంతో రువాండా ఏకపక్ష విజయాన్ని అందుకుంది. సిక్సర్లు, ఫోర్లతో పరుగుల వరద పారే టీ20 క్రికెట్‌లో 7, 10, 12, 17 పరుగులకే జట్లు కుప్పకూలడం క్రికెట్ అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసే అంశమే. పొట్టి ఫార్మాట్‌లో ఒక్క చెత్త రోజు ఎదురైతే ఎంతటి దారుణ రికార్డు ఖాతాలో చేరుతుందో ఈ స్కోర్లే చెబుతున్నాయి.



# ఆసియా క్రీడల ముంగిట భారత బృందానికి షాక్

## ప్రాక్టీస్‌లో గాయంతో నీరజ్ చోప్రా పోటీలకు దూరం




**న్యూఢిల్లీ, ఆగస్ట్ 29:** ఆసియా క్రీడల ముంగిట భారత బృందానికి షాక్ తగిలింది. జావెలిన్ స్టార్ నీరజ్ చోప్రా గాయపడ్డాడు. శిక్షణ సమయంలో అతడి చీలమండ లిగమెంట్‌కు గాయమైంది. దీంతో సెప్టెంబరులో జరగనున్న ఆసియా క్రీడలకు దూరం కానున్నాడు. ఈ విషయాన్ని నీరజ్ చోప్రా శనివారం సోషల్ మీడియా ద్వారా తెలియజేశాడు. ఎంతో కష్టపడిన తర్వాత లుసానె డైమండ్ లీగ్‌లో ఈ సీజన్‌లో అత్యుత్తమ (88.05 మీటర్లు)త్రోను అందుకున్నట్లు అనిపించింది. దురదృష్టవశాత్తు ఆ తర్వాత కొద్ది కాలానికే శిక్షణ సమయంలో నా చీలమండ వద్ద లిగమెంట్ చిట్లిపోయింది. వైద్యుడితోపాటు నా టీమ్‌తో చర్చించిన అనంతరం ఈ సీజన్‌లో మిగిలిన మ్యాచ్‌లకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాను. ఇది నిరాశ కలిగించే విషయం. నా ఆటలో రిథమ్‌ను అందుకునే దశకు చేరుకున్నానని భావిస్తున్న తరుణంలో ఇలా జరగడం బాధాకరం. ఇప్పుడు నా దృష్టి పూర్తిగా కోలుకోవడం, మరింత దృఢంగా తిరిగి రావడంపైనే ఉంది‘ అని నీరజ్ చోప్రా పేర్కొన్నాడు. ఈ గాయం కారణంగా సెప్టెంబరు 5న బ్రసెల్స్‌లో జరగనున్న డైమండ్ లీగ్ ÷నైల్‌కు కూడా నీరజ్ దూరంకానున్నాడు. సెప్టెంబరు 11 నుంచి 13 వరకు జరగనున్న ప్రపంచ అ÷-లథెటిక్స్ అల్టిమేట్ ఛాంపియన్‌షిప్స్‌లోనూ పాల్గొనడం లేదు. ఆసియా క్రీడలు సెప్టెంబరు 19 నుంచి జపాన్‌లో ప్రారంభంకానున్న విషయం తెలిసిందే.







## ప్యారడైజ్ నుంచి యెష నాగుల కట్టమీద పాట విడుదల

నేచురల్ స్టార్ నాని, టాలెంటెడ్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అంటెసిపేటెడ్ పాన్ ఇండియా మూవీ 'ది ప్యారడైజ్' నుంచి మేకర్స్ క్రేజీ అప్‌డేట్‌ను అందించారు. ఈ చిత్రం నుంచి రెండో సింగిల్‌గా మోస్ట్ పాపులర్ ఫోక్ సాంగ్ అయిన 'యెష నాగుల కట్ట మీద' పాటను డిజిటల్ వేదికగా విడుదల చేశారు. తెలంగాణ నేటివిటీని ప్రతిబింబించేలా సాగే ఈ జానపద గీతాన్ని సినిమాలో మరింత మాస్ వైబ్‌తో రీమిక్స్ వెర్షన్‌గా తెరకెక్కించారు. ఇప్పటికే సోషల్ మీడియాలోనూ, ప్రజల నోళ్లలోనూ నానుతున్న ఈ పాటకు అనిరుధ్ రవిచందర్ అందించిన రాకింగ్ మాస్ బీట్స్ ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. 'దసరా' బ్లాక్‌బస్టర్ తర్వాత నానితో పాటు తెరపై ఈ పాటకు రాబోయే మాస్ స్టెప్స్ సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చుతున్నాయి. ఈ క్యాచీ సాంగ్‌కు కాసర్ల శ్యామ్ సాహిత్యాన్ని అందించగా, జంగి రెడ్డి మరియు సింగర్ ప్రభ తమ శక్తివంతమైన గాత్రంతో ప్రాణం పోశారు. ఎస్.ఎల్.వి. సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 24, 2026న గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది.



## మహేంద్రగిరి వారాహి ట్రైలర్ విడుదల

టాలీవుడ్ నటుడు సుమంత్ హీరోగా, సంతోష్ జాగర్లపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న డివోషనల్ మిస్టరీ థ్రిల్లర్ 'మహేంద్రగిరి వారాహి' ఈ సినిమాకు సంబంధించిన థియేట్రికల్ ట్రైలర్‌ను శుక్రవారం చిత్రబృందం విడుదల చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ ట్రైలర్ సోషల్ మీడియాలో వ్యూస్‌తో దూసుకుపోతుంది. ఇక రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్, బ్రిడ్జ్ ఫిలిమ్స్ బ్యానర్లపై లక్ష్మణ్, కలిపు మధు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్ర ట్రైలర్‌ను ప్రముఖ డైరెక్టర్ వెంకీ అట్లూరి ముఖ్య అతిథిగా విచ్చేసి ఆవిష్కరించారు. పరమశివుడి ఆజ్ఞతో మహేంద్రగిరిలో కొలువుదీరిన గ్రామదేవత 'వారాహి మాత' నేపథ్యంతో ఈ కథ సాగుతుంది. మహేంద్రగిరి రాజకుటుంబానికి చెందిన వారు గత 150 ఏళ్లుగా అనుమానాస్పద స్థితిలో వరుసగా మరణిస్తుండటం, ఇదంతా అమ్మవారి శాపం వల్లే జరుగుతోందనే నమ్మకం చుట్టూ ఈ ట్రైలర్ ఆద్యంతం ఉత్కంఠను రేకెత్తిస్తోంది. ఆ రహస్యాన్ని ఛేదించేందుకు హీరో సాహసించే తీరు సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రంలో వారాహి మాతగా నటి ఐశ్వర్య రాజేష్ అలరించనుండగా, 'స్టార్ బాయ్' సిద్ధు జొన్నలగడ్డ ఒక కీలక పాత్రలో ట్రైలర్‌లో సర్ ప్రైజ్ ఎంట్రీ ఇచ్చి అంచనాలను అమాంతం పెంచేశారు. వీరితో పాటు మీనాక్షి గోస్వామి, మాళవిక నాయర్, బ్రహ్మానందం, వెన్నెల కిశోర్, రాజీవ్ కనకాల తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్న ఈ సోషియో-ఫాంటసీ థ్రిల్లర్‌ను ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 11, 2026న గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. వారాహికి ఎదురెళ్లి ఈ శాపాన్ని తప్పిస్తాను' అంటున్నారు సుమంత్. మహేంద్రగిరి రాజ వంశస్థులకు వారాహి అమ్మవారి శాపం ఎలా తగిలింది? అందుకు కారణం ఏంటి? మరి అన్నట్లుగానే ఆ శాపం ఏంటో కథానాయకుడు కనుగొన్నాడా? శాప విమోచనకు ఏం చేశాడు? అన్నది తెలియాలంటే 'మహేంద్రగిరి వారాహి' చూడాల్సిందే. సుమంత్ హీరోగా దర్శకుడు సంతోశ్ జాగర్లపూడి తెరకెక్కించిన సోషియో ఫాంటసీ చిత్రమిది. ఐశ్వర్య రాజేశ్, మాళవికా నాయర్, తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ మూవీ సెప్టెంబరు 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం ట్రైలర్ విడుదలైంది. ఆద్యంతం థ్రిల్ పంచేలా మూవీని తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది.

## నాగార్జున వందో సినిమా

### కింగ్ 100 గ్లింప్స్ విడుదల

అక్కినేని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న నాగార్జున కెరీర్‌లోని ప్రతిష్టాత్మక 100వ సినిమా సందడి మొదలైంది. 'కింగ్ 100'గా ప్రచారంలో ఉన్న ఈ ల్యాండ్‌మార్క్ ప్రాజెక్ట్‌కు సంబంధించిన టైటిల్‌ని గ్లింప్స్ ద్వారా రివీల్ చేశారు. సినిమా టైటిల్‌ని 'కింగ్ 100' అని పెట్టడం గమనార్హం. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ పై అక్కినేని ఫ్యామిలీ నిర్మాణంలో తమిళ దర్శకుడు రా కార్తీక్ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతుంది. నేడు నాగార్జున పుట్టిన రోజు సందర్భంగా సినిమా ఫస్ట్ గ్లింప్స్ ని రిలీజ్ చేసారు. మనుషుల్లో రెండు రకాలు.. ఒకటి డబ్బున్న వాళ్లు, మరొకటి డబ్బు లేని వాళ్లు అనే పవర్ ఫుల్ డైలాగ్‌తో నాగార్జునని పరిచయం చేశారు. గ్లింప్స్ చూస్తుంటే డబ్బు లేని ఓ పేదవాడు కసిగా ఎదిగి, మోసాలు చేస్తూ బాగా సంపాదించి కింగ్ స్థాయికి ఎలా ఎదిగాడు అనేది చిత్రంలో చాలా ఇంట్రెస్టింగ్‌గా చూపించనున్నట్టు అర్థమవుతుంది. మరోవైపు చిత్రంలో ఫాదర్ ఎమోషన్ కూడా ఉండబోతుంది అని, నాగార్జున ఇందులో ఫ్లాష్ బ్యాక్ లో యంగ్ వర్షన్ లో కూడా కనిపించబోతున్నట్టు అర్థమవుతుంది. చిన్న గ్లింప్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో ఆసక్తిని రేపుతోంది. కేవలం కొద్ది సెకన్ల వీడియోతోనే చిత్రంపై భారీ హైప్‌ను క్రియేట్ చేయడంలో మేకర్స్ సక్సెస్ అయ్యారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లో మరో ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్న అంశం టబు ఎంట్రీ. గతంలో నాగార్జున, టబు కలిసి నటించిన 'నిన్నే పెళ్లాడుతా', 'ఆవిడా మా ఆవిడే' వంటి సినిమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. చాలా ఏళ్ల తర్వాత ఈ హిట్ జోడీ మళ్లీ ఒకే సినిమాలో కనిపించబోతుండటంతో అభిమానుల్లో ప్రత్యేకమైన ఆసక్తి నెలకొంది. ఈ సినిమాలో టబు పాత్ర చాలా కీలకంగా ఉంటుందని, కథను మలుపు తిప్పే పవర్‌ఫుల్ క్యారెక్టర్‌లో ఆమె కనిపించనున్నారని సమాచారం. దీంతో నాగ్-టబు కాంబినేషన్‌పై అంచనాలు భారీగా పెరిగాయి. 'నితమ్ ఒరు వానమ్' చిత్రంతో దర్శకుడిగా తనదైన గుర్తింపు తెచ్చుకున్న రా కార్తీక్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. భావోద్వేగాలకు, కమర్షియల్ ఎలిమెంట్స్‌కు సమాన ప్రాధాన్యం ఇస్తూ నాగార్జున 100వ సినిమాను ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలుస్తోంది. గ్లింప్స్‌ను బట్టి చూస్తే, దర్శకుడు ఈసారి ఫీల్‌గుడ్ కథకు భిన్నంగా మిస్టరీ, యాక్షన్ అంశాలతో కూడిన కథను ఎంచుకున్నట్లు అంచనా వేస్తున్నారు. ఈ భారీ ప్రాజెక్ట్‌కు రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఈ మూవీని డిసెంబర్ 24న విడుదల చేయనున్నట్టు గ్లింప్స్ తో తెలియజేశారు.

## బేబీమూన్ ట్రిప్‌ను ఎంజాయ్ చేస్తోన్న సామ్

ప్రస్తుతం సమంత తల్లికాబోతున్న ఆనందంలో ఉన్నారు. ఒకవైపు బేబీమూన్ ట్రిప్‌ను ఎంజాయ్ చేస్తోన్న సామ్.. మరోవైపు వ్యాయామం చేస్తూ అభిమానులతో ఫొటోలు పంచుకుంటున్నారు. తాజాగా ఇన్‌స్టా వేదికగా ఫ్యాన్స్‌తో ముచ్చటించారు. కొందరు తల్లులు ఆమెకు సలహాలు ఇవ్వగా.. మరికొందరు ఆమెతో వారి అనుభవాలు పంచుకున్నారు. బేబీ కోసం కావాల్సిన వస్తువులన్నీ కొన్నాను. వాటిని చూస్తుంటే కాస్త కంగారుగా ఉంది. అందుకే ప్రస్తుతానికి వాటిని ప్యాక్ చేసి ఆ బ్యాగ్‌ను ఒక లాప్‌టాప్ స్టాండ్‌గా వాడుతున్నానన్నారు. ప్రెగ్నెన్సీతో ఉన్నప్పటి నుంచి నాకు కలలు వస్తున్నాయి. మీకు కూడా వస్తున్నాయా అంటూ ప్రశ్నలు వేస్తున్నారు. నిజంగానే.. ఈ విచిత్రమైన కలల గోల ఏంటో అర్థం కావట్లేదు. మరోవైపు11 కేజీలు పెరిగాననన్నారు. కొత్తగా తల్లి అయిన తర్వాత చాలా మార్పులు వస్తాయట. నేను ఆ క్షణాల కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నాను. పుట్టినవారికి పాలు పట్టడం, జోలపాడి నిద్రపోయేలా చేయడం.. ఈ పనులు ఫుల్ టైమ్ జాబ్‌లా మారిపోతాయి. అది చాలా అందమైన, గొప్ప అనుభూతి. జీవితాన్ని మార్చే అనుభవం. మాతృత్వం ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచుతుంది. మాతృత్వం వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ఇప్పటి వరకు తెలియదు. నేను ఊహించలేదు కూడా. మంచి విషయాన్ని తెలిపారు. ధన్యవాదాలు అంటున్నారు. పుట్టబోయే బిడ్డకు ఏం పేరు పెడతారంటే ..ఓ పేరును ఎంచుకోవడం చాలా కష్టం.. దీనికి మీ అందరి సహాయం కావాలి. స్కానింగ్ రిపోర్ట్స్ వచ్చేదాక చాలా టెన్షన్‌గా ఉంటుంది. అయితే ఈ కొత్త దశను పూర్తిగా ఆస్వాదిస్తున్నానని సమంత ఆనందంగా చెప్పారు.



## నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్‌కు ఇరుముడి రెడీ

మాస్ మహారాజా రవితేజ హీరోగా, ప్రతిభావంతుడైన దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన హార్ట్ టచింగ్ బ్లాక్‌బస్టర్ చిత్రం 'ఇరుముడి' . ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ అత్యున్నత ప్రమాణాలతో నిర్మించిన ఈ చిత్రం ఆగస్ట్ 21న ప్రేక్షకుల ముందుకు వచ్చి అనూహ్య విజయాన్ని సొంతం చేసుకుంది. మొదటి రోజు నుంచే అద్భుతమైన పాజిటివ్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయి కలెక్షన్లతో దూసుకుపోతోంది. రవితేజ కెరీర్‌లోనే ప్రత్యేకమైన చిత్రంగా నిలిచిన 'ఇరుముడి', భావోద్వేగాలతో కూడిన కంటెంట్‌తో అన్ని వర్గాల ప్రేక్షకులను థియేటర్లకు రప్పిస్తూ ఘన విజయంతో సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. పాన్-ఇండియా స్థాయిలో విడుదలైన యశ్ 'టాక్సిక్' వంటి భారీ బ్జడెట్ చిత్రం బరిలోకి దిగినప్పటికీ, 'ఇరుముడి' క్రేజ్ ఏమాత్రం తగ్గకపోవడం విశేషం. ఆ పోటీని సైతం తట్టుకుని రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఓవర్సీస్‌లోనూ హౌస్‌ఫుల్ బోర్డులతో స్టాం÷-రగ్ కలెక్షన్లను రాబడుతోంది. రవితేజ మార్క్ ఎనర్జీతో పాటు త్రినాథ్ పాత్రలో ఆయన పండించిన ఎమోషన్స్, శివ నిర్వాణ టేకింగ్, జీవీ ప్రకాశ్ సంగీతం సినిమా విజయానికి ప్రధాన బలంగా నిలిచాయి. థియేటర్లలో ఇంకా కలెక్షన్ల సునామీ కొనసాగుతున్న తరుణంలోనే, ఈ చిత్ర డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులకు సంబంధించిన ఆసక్తికరమైన సమాచారం బయటకు వచ్చింది. తాజా సమాచారం ప్రకారం, 'నెట్‌ప్లిక్స్' ఈ చిత్ర డిజిటల్ రైట్స్‌ను భారీ ఫ్యాన్సీ ధరకు దక్కించుకుంది. థియేట్రికల్ రన్ ముగిసే సమయానికి, అంటే సెప్టెంబర్ 18 నుంచి 'ఇరుముడి' చిత్రాన్ని నెట్‌ప్లిక్స్‌లో అధికారికంగా స్ట్రీమింగ్ చేయనున్నట్లు తెలుస్తోంది. సినిమా విడుదలైన నాలుగు వారాల విండో తర్వాత తెలుగుతో పాటు ఇతర ప్రధాన భాషల్లో కూడా ఇది అందుబాటులోకి రానుంది.




Printed, Published by **Mohammed Murthuza.** Printed at NUTAN OFFSET PRINTERS, R.S.NO. 434, PLOT NO 16,17, AUTO NAGAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520007. Ediotr: **MOHAMMED MURTHUZA,** PRGI No:APTEL/26/A3949, www.samayam.net Mobile No. **7036644111, 9490140565**